# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త




## పసుపుదారాల అలంకరణలో తాతయ్యగుంటగంగమ్మ

తిరుపతి,ఏప్రిల్ 28ప్రభాతవార్త:
తిరుపతి గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జాతర ముందు మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ నైనారు మహేశ్‌యాదవ్, సభ్యులు ,ఆలయ ఈఓ ఎ.జయకుమార్, అర్చకులు ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు.ప్రత్యేకంగా పూజలు చేసి గంగమ్మను పసుపుదారాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదవితరణ చేశారు.

## తిరుమలేశుని ఆశీస్సులందుకున్న ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్



తిరుమల,ఏప్రిల్ 28ప్రభాతవార్తప్రతినిధి:
ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకోగానే రాష్ట్ర మంత్రి రామ నారాయణ రెడ్డి,టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరి సాదరంగా ఆహ్వానించారు. ఆలయంలోపల ధ్వజ స్తంభానికి నమస్కరించి శ్రీవారిని దర్శించుకున్నారు.ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ రవిచంద్ర స్వామి వారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. ఆలయంలోపల ఉపరాష్ట్రపతితో టిటిడి అధికారులు ఫోటోదిగారు.



### వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నా

# ఎండమావిగా 'బాలాజీ రిజర్వాయర్'

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
ముందెన్నడూ లేని విధంగా వేసవి ఉష్ణోగ్రతలు పెరగడం...వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో మార్చి.ఏప్రిల్ మాసాల్లోనూ వర్షాలు కురవకపోవడం వంటి ఉపద్రవంతో ఇప్పటికే తిరుమలలో నీటి వినియోగం పెరిగింది. రోజువారీగా లక్షమంది వరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. నీటివినియోగం పెరిగితే జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గిపోతున్నాయనేది టిటిడి వర్గాల అంచనా.తిరుమలలో తాగునీటి అవసరాలకు ప్రధానంగా గోగర్భమ్‌డ్యామ్ నీరే ఆధారం. ఆ తరువాత ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార,పసుపుధారతీర్థాల నుండి నీటిని పంపింగ్‌చేసుకుని కాటేజీలకు, అతిథి గృహాలకు,భక్తులకు సరఫరా జరుగుతుంది. ఇప్పటికే తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వర్షాల మాట దేవుడెరుగు అన్నట్లు మారింది. తిరుమలకు తాగునీటి అవసరాలకు ఇప్పటికీ టిటిడి బోర్డు పెద్దలు, అధికారులు శాశ్వతసమస్య పరిష్కారం దిశగా కార్యాచరణ అమలుచేయడంలేదు. వర్షాలు కురవకపోతే దప్పికయినపుడే బావి తవ్వుదామనే చందంగా అధికారుల తీరు తయారైందని విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుపతి,తిరుమలలో వేసవి ఉష్ణోగ్రత 42డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. జలాశయాల్లో నీరు కూడా క్రమేణా తగ్గిపోతోంది. తిరుమలకు శాశ్వత నీటి సమస్యపరిష్కారం ఎప్పుడనేది ఇప్పుడు టిటిడి అధికారులను కలవరపెడుతోంది. సహజంగానే ప్రకృతి అనుకూలించి ,రుతుపవనాలు సకాలంలో వర్షిస్తే లేదా వరదలు సంభవించిన సమయాల్లో తిరుమలకొండపై ఐదు ప్రధాన జలాశయాలు గోగర్భమ్‌డ్యామ్, ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార,పసుపుధారతీర్థాలు నీటితో నిండితే ఏడాదిపాటు తాగునీటి సమస్య ఉండదు. లేకుంటే తిరుమల వాసులకు నీటిరేషన్ మొదలవుతుంది. వర్షాభావపరిస్థితులు ఎదురైతే జలాశయాల్లో నీరు లేకుంటే నీటికొరత ఏర్పడుతుంది. ప్రస్తుతం ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

**-బాలాజీనీరే శరణ్యం!:**

దేశవిదేశాల నుంచి వస్తున్న భక్తుల తాగునీటి అవసరాలకు వర్షాభావ పరిస్థితుల్లోనూ నీటిసమస్య తలెత్తకుండా శాశ్వత సమస్య పరిష్కారానికి అటు రాష్ట్రప్రభుత్వ నీటిపారుదలశాఖ, ఇటు టిటిడి అధికారులు ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే తిరుపతికి సమీపంలోని రేణిగుంట మండలం కరకంబాడి గ్రామం వద్ద బాలాజీరిజర్వాయర్‌నుచేపట్టాలని ప్రతిపాదనలు ,ఆలోచన వచ్చింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలోని పాలకమండలి బాలాజీరిజర్వాయర్ నిర్మాణానికి అనుమతులు తీసుకుని చేపట్టింది. అయితే పూర్తిస్థాయిలో పనులు మొదలుకాలేదు. కరకంబాడి వద్ద ఈ రిజర్వాయర్‌ను 3.082 టిఎంసిల నీటిసామర్థ్యంతో నిర్మిస్తే 1 టిఎంసి తిరుమల తాగునీటి అవసరాలకు మరో 2 టిఎంసిల నీటిని మల్లెమడుగు ప్రాజెక్టుకు పంపి అటు తాగునీరు ఇటు 55వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే అవకాశం ఉంటుందని భావించారు. తిరుమలకు వచ్చే భక్తులకు, స్థానికులు నివాసముంటున్న బాలాజీనగర్‌వాసులకు, హోటళ్ళకు, వ్యాపారకేంద్రాలకు నీటి అవసరం ఉంది. ఈ దశలో ఐదు ప్రధాన జలాశయాలతోబాటు కల్యాణిడ్యామ్.తెలుగుగంగ నీటిని తిరుమలకు సరఫరా చేసుకుంటున్నారు. వీటికి అయ్యే ఖర్చుతో బాలాజీరిజర్వాయర్ నిర్మించాలని గత తెలుగుదేశం ప్రభుత్వం భావించింది.

# ఘోర అగ్నిప్రమాదం

**- వి.కోటలో దగ్ధమైన ప్లాస్టిక్ వస్తువుల గోడౌన్**

**రూ. రెండు కోట్ల దాకా నష్టం !!**



వి.కోట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త
వి.కోట పట్టణ సమీపంలో ఉన్న పత్రపల్లి వద్ద ఓ వ్యాపారికి చెందిన ప్లాస్టిక్ వస్తువుల గోడౌన్ అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. దీంతో ప్లాస్టిక్ పరికరాలు కాలి బూడిద కాగా రెండు కోట్ల మేర నష్టం కలిగిఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. పత్రపల్లి సమీపంలో ఉన్న గోడౌన్‌లో ఒక్కసారిగా దట్టమైన పొగలు వ్యాపించాయి. ఏం జరిగిందో తెలుసుకునేలోపే ప్లాస్టిక్ పరికరాల గోడౌన్ మంటల్లో పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న గోడౌన్ యజమాని అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. కుప్పం నుంచి వచ్చిన ఫైర్ బృందం మంటలు ఆర్పేందుకు తీవ్రంగా యత్నించారు. పలమనేరు నుంచి సైతం మరో ఫైర్ బృందం వచ్చినా ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

### కన్నుల పండువగా

# చిన్నకోటాయ్ ఉత్సవం



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న చిన్నకోటాయ్ ఉత్సవంలో భాగంగా మంగళవారం కన్నుల పండువగా స్వామి అమ్మవార్ల ఊరేగింపు నాలుగు ప్రాకారాల మధ్య నిర్వహించారు. స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో ఆలయ అలంకార గురుకుల్ ప్రత్యేకంగా ముస్తాబు చేసారు. స్వామి అమ్మవార్లను నాలుగు ప్రాకారాల మధ్య ఊరేగించారు. ఆలయాధికారులు,సిబ్బంది భక్తుల భాగస్వామ్యంతో స్వామి అమ్మవార్ల పల్లకిని మోసారు. స్వామి అమ్మవార్లను పొగడ మాను కింద చల్లగా ఏర్పాటు చేసిన ఒట్టివేళ్ల పందిరిలో ప్రతిష్టించారు.భక్తులు తిలకిస్తుండగా స్వామి అమ్మవార్లకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అలంకరించి హారతులిచ్చారు.ఈ కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్‌పర్యవవేక్షణలో నిర్వహించగా ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి,పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ టెంపుల్‌ఇ న్స్ పెక్టర్ సుదర్శనం నాయుడులు పర్యవేక్షించారు.ఈ పూజల్లో ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, ఆలయ ఇఓ బికె వవెంకటేశులు, ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి,కోలా విశాల భక్తులు పాల్గొన్నారు.

# గూగుల్ ఏఐ డేటా సెంటర్ చారిత్రాత్మకం

### ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి




శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త
ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో గూగుల్ ఏర్పాటు సువర్ణ అధ్యాయం అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు.మంగళవారం రాత్రి పంచాయతీరాజ్ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం వేదికగా గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమం చారిత్రాత్మక అడుగుగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషికి నిదర్శనం అన్నారు. సుమారు రూ. 1.35 లక్షల కోట్ల (15 బిలియన్ డాలర్లు) భారీ పెట్టుబడితో చేపట్టబడుతున్న ఈ ప్రాజెక్ట్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా మార్చే సామర్థం కలిగినదని అన్నారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో భూమిపూజ నిర్వహించి ఈ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టడం ఎంతో శుభపరిణామమని పేర్కొన్నారు. ఐటీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలనే ముఖ్యమంత్రి దూరదృష్టికి ఇది ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. ప్రత్యేకంగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేష్ గూగుల్ వంటి గ్లోబల్ దిగ్గజ సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడంలో చేసిన కృషి అభినందనీయమని సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని గెలుచుకుని, రాష్ట్రాన్ని ఐటీ పెట్టుబడులకు కేంద్రంగా నిలబెట్టడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఆంధ్రప్రదేశ్ నాయకత్వంపై నమ్మకం ఉంచి ఈ భారీ పెట్టుబడికి ముందుకు రావడం ప్రతి తెలుగువారికి గర్వకారణమని అన్నారు. ఈ డేటా సెంటర్ స్థాపనతో విశాఖపట్నం ప్రపంచ ఏఐ మ్యాప్‌లో ఒక ప్రముఖ కేంద్రంగా ఎదగనుందని తెలిపారు. అమెరికా వెలుపల గూగుల్ ఏర్పాటు చేస్తున్న అతిపెద్ద ఏఐ కేంద్రాలలో ఇది ఒకటిగా నిలవడం విశేషమని చెప్పారు. పీఎం మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర కూటమి ప్రభుత్వం సమన్వయంతో పనిచేయడం వల్లే ఇలాంటి భారీ ప్రాజెక్టులు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా వేల సంఖ్యలో ఉన్నత స్థాయి ఐటీ ఉద్యోగాలు రాష్ట్ర యువతకు లభించనున్నాయని, భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు దూసుకెళ్తున్న నేపథ్యంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుందని అన్నారు.విశాఖ పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు అంతర్జాతీయ ప్రమాణాలకు పెరుగుతాయని, విదేశీ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం ప్రభుత్వం కల్పించిన విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు.గూగుల్ సహకారంతో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించి, వారిని గ్లోబల్ స్థాయి నిపుణులుగా తీర్చిదిద్దే అవకాశాలు విస్తరించనున్నాయని అన్నారు. ఈ ప్రాజెక్ట్ చుట్టూ అనేక చిన్న మరియు మధ్యతరహా ఐటీ సంస్థలు ఏర్పడి ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని చెప్పారు. ఇలాంటి మెగా ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మరింత బలోపేతం చేస్తాయని, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక కేంద్రంగా నిలబెడతాయని బొజ్జల సుధీర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# అమ్మవారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### 29న అంకురార్పణ.. 30 నుండి మే 2వ తేదీ వరకు వసంతోత్సవాలు

తిరుచానూరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త;
తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారుఅనంతరం ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారుఏప్రిల్ 29న అంకురార్పణ అమ్మవారి ఆలయంలో వసంతోత్సవాలకు బుధవారం సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఏప్రిల్ 30 నుండి మే 2వ తేదీ వరకు వసంతోత్సవాలు :ఉత్సవాల్లో భాగంగా మే 1వ తేదీ ఉదయం 9.30 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. వసంతోత్సవాలు జరిగే మూడు రోజులు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరించి భక్తులను కటాక్షి ంచనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్ , టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి పాల్గొన్నారు.



## లక్ష్మీనరసింహునికి గణనాధుడి పట్టు వస్త్రాలు సమర్పణ



కాణిపాకం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:
పెంచలకొన పెనుశీల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. గత కొద్ది రోజులుగా పెంచలకొన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కాణిపాకం దేవస్థానం తరపున మంగళవారం స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఇఓ కె.పెంచల కిషోర్ దంపతులు ఆలయ అధికారులు, అర్చకులతో కలిసి మంగళవారం పెంచలకోన దేవస్థానం చేరుకొని స్వామి, అమ్మవార్లకు నూతన పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్ళి సమర్పించారు. పెంచలకొన దేవస్థానం చేరుకున్న వారికి ఆ దేవస్థానం ఇఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం దేవస్థానంలో ఇఓ పెంచల కిషోర్ దంపతులు, ఛైర్మన్ మణినాయుడులకు స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురకుల్, తానా చార్యులు, ఫణిస్వామి, పాలక మండలి సభ్యురాలు అనుసూయ, సూపరిటెండెంట్ వాసు, బాలాజీ నాయుడు, వేద పండితులు, పెంచలకోన దేవస్థానం అదికారులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

## వర్క్ టు రూల్ పాటిస్తున్న కార్మికులు

**- స్విమ్స్‌లో ఆగిపోయిన ఆపరేషన్లు... మూతబడిన థియేటర్లు**

**- 60 రోజులుగా ఎర్రటి ఎండలలో దీక్షలు చేస్తున్న కార్మికులు**

**- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి**




తిరుపతి హెల్త్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త
టీటీడీ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో వర్క్ టూ రూల్‌ను కార్మికులు పాటిస్తున్నారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ హోదాను తొలగించి వార్డు బాయ్‌లుగా గుర్తించాలని గత రెండేళ్లుగా పోరాడుతున్న కార్మికులు మిగిలిన కార్మికులందరికీ వేతనాలు పెంచి శానిటేషన్ హోదాలో ఉన్న కారణంగా రెండేళ్లుగా యాజమాన్యం వేతనాలు పెంచలేదు. శానిటేషన్ హోదాను తొలగించి వార్డు బాయ్‌లుగా గుర్తిస్తామని గతంలో పలుమార్లు యాజమాన్యం ప్రకటించారు. లేబర్ అధికారులతో స్విమ్స్ యాజమాన్యం ఒప్పందాలు చేసుకున్నారు. ఒప్పందాలు అమలు చేయాలని కార్మికులు గత 60 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. నాలుగు రోజుల్లో సమస్యలు పరిష్కారం చేస్తామని గతంలో ప్రకటించిన టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర 15 రోజులు కావస్తున్నా పట్టించుకోకపోవడంతో తాము శానిటేషన్ మినహా మిగిలిన పనులు చేయమని కార్మికులు భీష్మించుకున్నారు. థియేటర్లలో ప్రొసీజర్ చేయాల్సి న కార్మికులు ఆ పనులు చేపట్టకపోవడంతో థియేటర్లు మూతబడ్డాయి. స్ట్రెచర్లు, వీల్ చైర్లు పట్టే వాళ్లు కూడా లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్క్ టు రూల్ నుంచి అత్యవసర సేవల విభాగానికి కార్మికులు మినహాయింపునిచ్చారు. కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు... వారికి ఇచ్చిన హామీలను అమలు చేసి రోగుల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేసారు. కార్మికుల పోరాటానికి సిఐటియు మద్దతిస్తుందన్నారు.

### జర్నలిస్ట్ దారుణ హత్యతో

# వి.కోటలో తీవ్ర విషాదం

**కాపుకాచి కత్తులతో ప్రత్యర్థుల దారుణం**

**సంఘటనా స్థలిలో జిల్లా ఎస్పీ ఆరా - జర్నలిస్టు సంఘాల నిరసన !!**



సంఘటనా స్థలిని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

వి.కోట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త
పలమనేరు నియోజకవర్గం వి.కోట మండల ఓ దినపత్రిక విలేకరి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన మంగళవారం ఉదయం సంచలనం కలిగించింది. ప్రత్యర్థులు పథకం ప్రకారం కాపుకాచి కత్తులతో దాడిచేసి దారుణానికి ఒడిగట్టారు. ఈ సంఘటనతో వి.కోటలో భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. సమాజంలో తప్పొప్పులు గమనిస్తూ ప్రజలపక్షాన నిలబడి వార్తలు రాసే విలేకరులపై హత్యలకు పాల్పడటం పట్ల ప్రజాసంఘాలు, మేధావులు, రాజకీయవేత్తలు తీవ్రస్థాయిలో నిరసన తెలిపాయి. వి.కోట మండలంలో ఓ దినపత్రిక కంట్రిబ్యూటర్‌గా జగన్మోహన్‌రెడ్డి (51) విధులు నిర్వహిస్తున్నాడు. మరో పత్రికా రిపోర్టర్‌తో కలసి ఉదయం వాకింగ్ చేస్తుండగా ఒక్కసారిగా దుండగులు కత్తులతో దాడి చేసి ముందస్తు పథకంలో భాగంగా జగన్‌ను హతమార్చారు. పక్కనే ఉన్న మరో రిపోర్టర్‌ను ప్రత్యర్థులు నెట్టేశారు. విచక్షణా రహితంగా ఒక్కసారిగా జగన్‌పై కత్తులతో దాడికి దిగడంతో సంఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, పలమనేరు డిఎస్పీ ప్రభాకర్ వి.కోటకు చేరుకుని విచారణ చేపట్టారు. హత్యకు పాల్పడింది రౌడీషీటర్ తమీమ్ అని ప్రాథమికంగా నిర్ధారించినట్లు పోలీసుల సమాచారం. మృతదేహంను ప ంచనామా అనంతరం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా హత్యకు సంబంధించిన కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. మృతుడు జగన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జర్నలిస్ట్ జగన్ మృతి పట్ల ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి, అఖిల పక్ష నేతలు ప్రగాఢ సంతాపం వ్యక్ ం చేశారు.హంతకులు ఎంతటివారైనా ,ఎవరైనా ఉపేక్షించొద్దని ఎమ్మెల్యే జిల్లా ఎస్పీకి ఆదేశించారు.

## గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

**శాంతిపురం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**

స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంను ప్రారంభించారు. జూన్ 6వతేది వరకు పిల్లలకు ఉచితంగా డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, కేరమ్స్, చెస్ వంటి ఆటలు, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించడం వంటి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని గ్ర ంథాలయ అధికారిణి సుభాషిణి తెలిపారు. ఆసక్తిగల పిల్లలు 7989924198నెంబరును సంప్రదించాలని కోరారు.

## వి.కోట..కుప్పంలో జర్నలిస్టుల నిరసన

**వి.కోట/కుప్పం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



వి.కోట మండలంలో ఓ దినపత్రిక రిపోర్టర్ జగన్మోహన్‌రెడ్డి దారుణహత్యను ఖండిస్తూ వి.కోట, కుప్పంలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. వి.కోటలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. ఈ సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కుప్పంలో కడ కార్యాలయం వద్ద నుంచి అర్బన్ పోలీస్‌స్టేషన్ వరకు జర్నలిస్టులు నల్లబా ్యడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బస్టాండు కూడలిలో బైఠాయించారు. జగన్ హత్య దారుణమని ఈసంఘటనకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని పేర్కొంటూ ఎస్పై రామకృష్ణకు ఫిర్యాదు చేశారు.

## గరుడవాహనంపై శ్రీరామలింగేశ్వరస్వామి ఊరేగింపు



**కుప్పం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**

కుప్పం రాధాకృష్ణరోడ్డులో నెలకొని ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం గరుడవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. రాత్రిహనుమంత వాహనంపై ఊరేగింపు జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిలోనే మీ పిల్లలకు బంగారు భవిష్యత్తు

హెచ్ఎం ధర్మినేని జగదీష్

**చంద్రగిరి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**




మీ చిన్నారులకు ప్రభుత్వ బడిలోనే బంగారు భవిష్యత్తు లభించగలదని దోర్నకంబాల జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ధర్మినేని జగదీష్ అన్నారు. దోర్నకంబాల గ్రామంలో మంగళవారం ఆయన ఉపాధ్యాయులతో కలసి బడి పిలుస్తుంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర ్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనుభవజ్ఞులైన, అర్హత కలిగిన ఉపాధ్యాయులచే నాణ్యమైన భోధనలు చేస్తున్నట్లు తెలిపారు. మీ పిల్లల జీవితాలకు ప్రభుత్వ పాఠశాలల్లో సంపూర్ణ వికాసం లభించగలదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్ళి వివరించారు. ఈ క్రమంలో కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ హైమావతి, నరశింగాపురం బ్యాంక్ డైరెక్టర్ మహేష్, ఉపాధ్యాయులు రాజేంద్రబాబు, పీరయ్య, రమేష్, శ్రీనివాసులు, విజయ్‌కుమార్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరీకి "నాంధీ ఘన సన్మానం"

**చంద్రగిరి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**



చంద్రగిరికి చెందిన నాంధీ స్వచ్ఛంధ సేవా సంస్థ వ్యవస్థా పకుడు పసల ప్రసాద్ ఆధ్వర్యం లో మంగళ వారం తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరీని ఘనంగా సన్మానిం చారు. చంద్రగిరికి బదిలీపై వచ్చిన తహశీల్దార్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలసి దుశ్శాలువ, పుష్పగుచ్ఛం, స్వీట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాంధీ వైఎస్ ప్రెసిడెంట్ కొమ్ము ఉదయ్‌కుమార్, టిడిపి నాయకుడు కత్తి నాగార్జున వున్నారు.

## రిపోర్టర్ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి.!

చంద్రగిరి పాత్రికేయులు సిఐ సురేష్‌కుమార్‌కు వినతి

**చంద్రగిరి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

వి.కోట మండలంలో ఓ పత్రికా విలేకరి జగన్మోహన్ రెడ్డిని కిరాతకంగా హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం చంద్రగిరి మండల ప్రాత్రికేయులు సిఐ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విలేకరులపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సిఐతో పాటు ఎస్ఐలు అరుణాచలం, ప్రవళ్ళిక వున్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి జరిమానా

**చిత్తూరుహెల్త్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారి నుండి 80 వేల రూపాయలు జరిమానా వసూలు చేసినట్లు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు తెలిపారు. చిత్తూరు నగర పరిధిలో సోమవారం ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 8 మంది వ్యక్తులు పట్టుబడ్డారని, వీరిని మంగళవారం ఫస్ట్ స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిస్తే జడ్జి కె.పరిమిళదేవి ఒక్కొక్క వాహనదారుడికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారన్నారు.

## విలేకరిని హత్య చేసిన నిందితుడికి కఠినంగా శిక్షించాలి

**గుడిపాల, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

వి.కోటలో ఓ పత్రికా విలేకరి జగన్మోహన్‌రెడ్డిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి డిమాండ్ చేశారు. వ్యక్తిగత మనస్పర్ధలతో పత్రికా విలేకరిని హత్య చేయడం ప్రజాస్వామ్యంకు విరుద్దమన్నారు. ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. మృతి చెందిన విలేకరి కుటుంబ సభ్యులకు ఎంపిపి తన సానుభూతిని తెలిపారు.

## ఉపాధిహామీలో 1.35లక్షల రికవరీకి ఆదేశం.. డ్వామా పీడీ రవికుమార్

**పెద్దపంజాణి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**



మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి 1లక్ష35 వేలరూపాయలను రికవరీ చేసేందుకు ఆదేశించినట్లు డ్వామా పీడీ రవికుమార్ పేర్కొన్నారు. మంగలవారం స్థానిక మండల ఉపాధిహామీ కార్యాలయంవద్ద ఉపాదిహామీ సామాజికతనిఖీ బహిరంగసభ నిర్వహించారు. ఎంపీడీఓ బాలాజీ మాట్లాడుతూ 2024-2025 సంవత్సరంకు గాను సుమారు 8కోట్ల రూపాయల నిధులను ఉపాధిహామీ పథకంలో ఖర్చుచేసినట్లు తెలిపారు. కాగా పలువురు క్షేత్రస్థాయి సిబ్బందికి జరిమానాకింద 22000 ,రికవరీకింద 4143రూపాయలు, పంచాయతీరాజ్ శాఖనుండి 71515రూపాయలు రికవరీ చేయాలని డ్వామా పీడీ రవికుమార్ ఆదేశించారన్నారు. ఉపాదికూలీలకు పనులు కల్పించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందని ఆయన పేర్కొన్నారు. పథకాలు అమలలోఎలాంటి పొరపాట్లకు తావుఇవ్వక పారదర్శ కంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం ముఖాధారిత హాజరుచేయడం జరుగుతుంద ్నారు. అలాగే ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ రోజుకు కనీసం వందమంది సీనియర్ మేట్లకుగాను 50మందికి పనులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఏపీడీ ధనలక్ష్మి, డిప్యూటి ఎంపీడీఓ లు శారదాదేవి, సుదాకర్ రావు, సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ కన్నారెడ్డి, డిఆర్పీలు శోభారాణి, శంకర్, సయ్యద్ బాషా, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు, ఉపాదిహామీ ఏఓలు మురుగేషన్, చిన్నరెడ్డెమ్మ, జేఈలు సుబ్రమణ్యం, నాగమణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఉపాది సిబ్బంది, వేతనదారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలి

జిల్లా ప్రాజెక్టమేనేజర్ శివశంకర్

**పెద్దపంజాణి ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**




రైతు సాధికారసంస్థద్వారా ప్రకృతి వ్యవసాయంపై రైతుసేవా సిబ్బందికి రెండవరోజు శిక్షణాతరగతులను క్షేత్రస్థాయిలో నిర్వహించారు. రైతులు ఎక్కువ ఖర్చు చేయకుండా తక్కువ నిధి వినియోగంతో అదికదిగబడినిచ్చే పంటలసాగుపై దృష్టిసారించాలన్నారు. పంటలకు రసాయనికఎరువులువాడకం తగ్గించాలన్నారు. కాషాయాలువాడి పంటల సస్యరక్షణకు చర్యలు తీసుకోవచ్చని క్షేత్రస్థాయిలో రైతులకు వాటితయారీ గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయం చేపట్టే రైతులకు తగుప్రోత్సాహం అందిస్తుందన్నారు. రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఓ హేమలత, రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పెద్దపంజాణిలో జర్నలిస్టుల ధర్నా

**పెద్దపంజాణి ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

మండలకేంద్రమైన పెద్దపంజాణిలో జర్నలిస్టులు వి.కోట మండలం ఓ పత్రికా విలేకరి జగన్‌మోహన్ రెడ్డి హత్యను ఖండిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రామ్మూర్తికి వినతిపత్రం అందించారు. వి.కోటలో జర్నలిస్టును దారుణంగా హత్యచేయడం హేయమైనచర్య అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దపంజాణి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రెడ్డిప్రసాద్, ఉపాధ్యక్షుడు ప్రకాష్‌కుమార్ తదితరులు, అఫ్జల్ కూటమి నాయకులు మాజీ ఎంపీపీ మురళీకృష్ణ, నిరంజన్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం ధ్యేయం - టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్

**కుప్పం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



రైతుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం ధ్యేయం అని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వానగుట్టపల్లి రైతు సేవా కేంద్రంలో రైతులకు ప్రభుత్వం రాయితీ తో అందిస్తున్న మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో సాగు, తాగునీటి అవసరాల కోసం సిఎం చంద్రబాబునాయుడు 3700కోట్ల వ్యయంతో కృష్ణాజలాలు కుప్పంకు తీసుకువచ్చారన్నారు. ఇప్పటికే 150చెరువులు నింపారన్నారు. రైతులకు వివిధ శాఖల ద్వారా రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, అక్మల్, రైతులు, ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టును హత్యచేసిన వారిని సత్వరం అరెస్టు చేయాలి

## - చిత్తూరులో కదం తొక్కిన విలేకరులు

**చిత్తూరుహెల్త్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**



వి.కోట మండలంలో ఓ దినపత్రిక జర్నలిస్టును హత్య చేసిన వ్యక్తులను సత్వరం అరెస్టు చేయాలని జిల్లా ఎపియుడబ్ల్యుజె నాయకులు డిమాండ్ చేశారు. వి.కోటలో మంగళవారం జరిగిన జర్నలిస్టు హత్యను నిరసిస్తూ ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం చిత్తూరులో విలేకరులు కదం తొక్కారు. చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట పెద్ద ఎత్తున చేరుకున్న విలేకరులు వి.కోటలో విలేకరిని హత్య చేసిన నిందితులను సత్వరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. పాత్రికేయులపై భౌతిక దాడులకు పాల్పడటం మాత్రమే చూశామని, అయితే సిఎం సొంత జిల్లాలో పట్టపగలు నడిరోడ్డుపై జర్నలిస్టును హత్య చేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు. హత్యకు పాల్పడ్డ వ్యక్తిపై రౌడీషీట్ వుందని చెప్తున్నప్పటికీ పోలీసులు అతనిపై ఎందుకు నిఘా వుంచలేదని విలేకరులు ప్రశ్నించారు. అనంతరం వన్‌టౌన్ ఇన్‌ఛార్జీ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎపియుడబ్ల్యుజె అధ్యక్షులు లోకనాథం, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్, కాళేశ్వర్‌రెడ్డిలు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్‌కుమార్, పెద్ద ఎత్తున జర్నలిస్టులు, వివిధ మండలాల నుండి భారీగా విలేకరులు హాజరయ్యారు.

### బంగారుపాళెంలో

**బంగారుపాళ్యం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

వి.కోట మండల కేంద్రంలో ఓ దినపత్రిక విలేకరి జగన్మోహన్‌రెడ్డిని మంగళవారం ఉదయం హత్యచేసిన నిందితులను పోలీసులు కఠినంగా శిక్షించాలని బంగారుపాళ్యం ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యద ర్శులు శివకుమార్, అరవిందబాబులు డిమాండ్ చేశారు. మంగళ వారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎపిడబ్ల్యుజె ఆధ్వర్యం లో ఎస్ఐ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అవినీతికి వ్యతిరేకంగా వార్తలు రాస్తూ తన విధిని నిర్వహిస్తున్న విలేకరిని దారుణంగా హత్య చేయడం అమానుష చర్యగా పేర్కొన్నారు.

### గుడిపాలలో

**గుడిపాల, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

వి.కోట మండలంలో మంగళవారం ఓ పత్రికా విలేకరిని దారుణంగా హత్య చేసిన నిందితులను సత్వరం అరెస్టు చేసి వారికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని విలేకరులు డిమాండ్ చేశారు. వి.కోటలో విలేకరి హత్యను నిరసిస్తూ మంగళవారం గుడిపాల మండలంలోని విలేకరులు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సత్వరం నిందితులను అరెస్టు చేయాలని గుడిపాల ఎఎస్ఐను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడిపాల మండల విలేకరులు రమేష్, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### పలమనేరులో

**పలమనేరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:**



వి.కోటలో ఓ దినపత్రిక విలేకరి జగన్‌మోహన్‌రెడ్డి హత్యకు గురైనట్లు తెలియడంతో పలమనేరులో విలేకరులు, అన్ని వర్గాల ప్రజలు ఉలిక్కి పడ్డారు. మంగళవారం ఉదయం తెల్లవారక ముందే ఈ సంఘటన వెలుగులోకి రావడంతో అంతటా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో పాటు బార్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక విలేకర్లు భారీ ఎత్తున ధర్నా చేశారు. ఎంబిటి రోడ్డులో ధర్నా చేయడంతో ట్రాఫిక్ స్థంభించి పోయింది. తెలుగుదేశం నాయకులు ఆర్ఇ బాలాజీ, గిరిబాబు, నాగరాజు, ఖాజా, బార్ అసోసియేషన్ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రింట్ ఎలక్రానిక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## 12, 13న చిత్తూరు నడివీధి గంగజాతర

- గంగజాతర వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సికె బాబు సతీమణి సికె లావణ్యబాబు

**చిత్తూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**



చిత్తూరు నడివీధి గంగజాతర మహోత్సవం మే నెల 12, 13వ తేదీల్లో నిర్వహించనున్నట్లు గంగజాతర వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సికె బాబు సతీమణి సికె లావణ్యబాబు పేర్కొన్నారు. చిత్తూరు పొన్నియమ్మన్‌గుడి వీధిలో గంగజాతర కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం సికె లావణ్యబాబు విలేకరుల సమావేశం నిర్వహించి గంగజాతర నిర్వహణ వివరాలను వెల్లడించారు. గంగజాతరకు సంబంధించి మే 5వ తేదీ చాటింపు జరుగుతుందన్నారు. అలాగే 12వ తేదీ మంగళవారం ఉదయాత్పూర్వం అమ్మవారి తొలిపూజ, ఉదయం అంబళ్ళు, నైవేధ్యం, రాత్రి పూర్ణకుంభారాధనము జరుగుతుందన్నారు. అలాగే 13వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటల నుండి విద్యుత్‌దీపాలంకరణ, బ్యాండు వాయిద్యాల నడుమ భారీ ఊరేగింపుతో గంగమ్మ నిమజ్జనం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో గంగజాతర కమిటీ సభ్యులు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆహ్లాదకర వాతావరణంలో వేసవి శిక్షణ శిబిరాలు

- జిల్లా గ్రంధాలయసంస్థ చైర్మెన్ రెడ్డివారి గురవారెడ్డి

**చిత్తూరురూరల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :**



జిల్లా గ్రంధాలయ సంస్థ ఆద్వర్యంలో వేసవిశిక్షణా శిబిరాలను ఆహ్లాదకర వాతావ రణంలో నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాల ను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కేంద్ర గ్రంధాలయ సంస్థ చైర్మెన్ రెడ్డివారి గురవారెడ్డి కోరారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంధాలయం నందు వేసవి శిక్షణా శిబిరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 28 నుంచి జూన్ 6వ తేది వరకు ప్రతిరోజు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు నిర్వహిస్తామని, ఈ శిక్షణ తరగతులలో విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, యోగ, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ తదితర అంశాలను నేర్పిస్తారని, పిల్లల భవిష్యత్తుకు గ్రంధాలయం బలమైన పునాది అని ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు తప్పక వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి శర్మ, ఉపగ్రంధాలయ అధికారి లావణ్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, రచయిత బాలక్రిష్ణారెడ్డి, గ్రంధాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పూతలపట్టు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

**పూతలపట్టు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పరివేషణలో చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి ఆధ్వర్యంలో పూతలపట్టు గ్రంథాలయ అధికారి రవీంద్ర బాబు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో ఉద్దేశించి ప్రధానంగా సమ్మర్ క్యాంపు తేదీ 28.4 .2026 నుంచి 6.6.2026 వరకు ప్రపంచ జ్ఞానం రావాలంటే పత్రికలు చదవాలని పుస్తక పఠణం బాగా అభివృద్ధి చేసుకోవాలని ఈ సమ్మర్ క్యాంపులో అక్షరాలను బాగా నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు చాలా ఉపయోగపడుతుంది అన్నారు. ఇంకా ఎక్కువ మంది పాల్గొనే విధంగా విద్యార్థులు అందరూ రావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో చాలా ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థులు బయటకు ఎండకు ఎక్కడా విపరీతమైన ఎండలు సమయంలో తిరగకుండా గ్రంథాలయంలో పుస్తకాలను చదవాలని పుస్తక పఠనం పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎండలకు ఎక్కడగా తిరగకుండా చల్లని పానీయాలు తాగాలని ఎండకు వడదెబ్బకు తగలకుండా జాగ్రత్త వహించాలని గ్రంథాలయంలో కూర్చొని పుస్తకాలను బాగా చదివితే వీటి నుంచి తప్పించుకోవచ్చని వాళ్ళు సూచనలు ఇచ్చారు. ఎండాకాలంలో మంచి నీరు బాగా తాగాలని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. తెలుగులో ఉన్నటువంటి అక్షరాలన్నీ కూడా ఖచ్చితంగా నేర్చుకోవాలని వాటి ద్వారా పద్యాలను వెల్లడించారు. విద్యార్థుల్లో చక్కగా చదవడం రాయడం హ్యాండ్ రైటింగ్ నేర్చుకోవడం అన్నీ కూడా జరుగుతాయని కాబట్టి ఈ సమ్మర్ క్యాంపు బాగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా కార్యదర్శి ఆర్ వి ఎస్ ఎస్ శర్మ ఎంఈఓ 1 వాసుదేవన్ రావు, ఎంఈఓ 2 మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, నాదముని, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి



**తవణంపల్లి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

భార్యభర్తలు గొడవ పడ్తుండగా ప్రమాదవశాత్తు భర్త చెరువులో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని కామాలూరు వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్ఐ రమేష్‌బాబు కథనం మేరకు వివరాలు ఇలా వున్నాయి. పులిచెర్ల మండలం వెంకట దాసరపల్లి ఎస్సీ వాడకు చెందిన వి.భాస్కర్(35) అనే వ్యక్తి తవణంపల్లి మండలంలోని కామాలూరు ఎస్టీ కాలనీకి చెందిన లలిత అనే మహిళను గత రెండు సంవత్సరాల క్రితం వివాహం చేసుకుని ఇక్కడే కాపురం వుంటున్నాడు. ఈ నేపథ్యంలో భాస్కర్ సోమవారం సాయంత్రం మద్యం సేవించి ఇంటి సమీపంలోని చెరువు వద్ద లలితతో గొడవ పడ్డాడు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడు. ఈ విషయంను గమనించిన స్థానికులు అక్కడికి చేరుకుని ఘటనా స్థలంకు చేరుకుని చెరువులో పడిన లలితను బయటికి తీశారు. అయితే అప్పటికే చెరువులో మునిగిపోయిన భాస్కర్‌ను మంగళవారం చెరువు నుండి బయటికి తీశారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ రమేష్‌బాబు దర్యాప్తు చేస్తున్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్-2026 సర్వేలో పాల్గొనాలి

- మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్



**చిత్తూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

స్వచ్ఛ సర్వేక్షణ్-2026 ప్రజా అభిప్రాయ సర్వేలో నగర ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోవాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్-2026 జాతీయ స్థాయి ర్యాంకింగ్‌లో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ మెరుగైన ర్యాంకింగ్ కోసం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సర్వేలో నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజల అభిప్రాయానికి ప్రాధాన్యత వుందని, నగరంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలపై పాజిటివ్ సమాధానాలు ఇవ్వడం ద్వారా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకింగ్ వచ్చేలా తోడ్పాటు అందించాలన్నారు. నగర పరిధిలోని ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు సర్వేలో పాల్గొనాలని కమీషనర్ పిలుపునిచ్చారు.

## జర్నలిస్టును హత్య చేసిన నిందితుడిని తక్షణం అరెస్టు

- ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

**చిత్తూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**



వి.కోటలో జర్నలిస్టును హత్య చేసిన నిందితుడిని సత్వరం అరెస్టు చేయాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఎస్పీ తుషార్ డూడిని ఆదేశించారు. వి.కోట మండలంలో జర్నలిస్టును హత్య చేయడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా భావించే జర్న లిస్టులపై ఇలాంటి దాడులు జరుగడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనపై ఎంపీ దగ్గుమళ్ళ స్పందిస్తూ ఎస్పీ తుషార్ డూడితో ఫోన్‌లో సంప్రదించి హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులు ఎంతటి వారైనా సరే ఉపేక్షించకుండా అరెస్టు చేయాలని ఎస్పీని కోరారు. అలాగే జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని ఎంపీ పేర్కొన్నారు.

## శేషవాహనంపై చెన్నకేశవుని రాజసం

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఊరందూరులోని చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లన శేషవాహనంలో ఊరేగించారు.అనుబంధ ఆలయాల్లో ఉత్సవాలకు దేవస్థానం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుదీర్‌రెడ్డి అనుబంధ ఆలయాల్లో ఉత్సవాకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అంతేకాకుండా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఇఓ బికె వెంకటేశులు నిత్యం పరిశీలనలు జరుపుకుంటూ ఉత్సవాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక్కడ దిట్టం అందించటం లాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం తిరుచ్చివాహనంలో స్వామి వారు దర్శనమిచ్చారు.నాలుగుమాడావీదుల్లో స్వామి వార్ల ఊరేగింపులో గ్రామ ప్రజలు దర్శనం చేసుకున్నారు. కాగా సాయంత్రం స్వామి అమ్మవార్లను శేష వాహనంపై ప్రతిష్టించి ఊరేగింపుజరిపారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ పూజారి జనార్ధన్ శర్మ పర్యవేక్షించారు. కాగా ఆలయాధికారులుఎఇఓ హేమామాలిని,చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, దుర్గా ప్రసాద్ పర్యవేక్షించారు.

## మాతృభాషపై పట్టు: పరభాషాభ్యసనకు ఆయువుపట్టు

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



మనం మాతృభాషపై పట్టు సాధిస్తే పరభాషలను అభ్యసనం చేయటం సులభమని మండల విద్యాశాఖాధికారి భువనేశ్వరి వివరించారు.మంగళవారం ఇక్కడి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య విన్నూత్నంగా విద్యార్థులకు కన్నడ,తమిళ, మలయాళ భాషాభ్యాసనంలో శిక్షణ ఇచ్చారు.ఈ విద్యార్థులను భాషలపై పట్టు ఉన్న వారితో పరీక్షలు జరిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన మండల విద్యాశాఖాధికారి భువనేశ్వరి హాజరై విద్యార్థులను పరీక్షించారు. ఈ సందర్భంగా ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చిన వెంకటయ్య మాట్లాడుతూ మనకు మాతృభాషపై శ్రద్ద ఉత్సాహం ఉంటే ఏ భాషనైనా సులభంగా నేర్చుకోవచ్చునని వివరించారు.తెలుగుభాషలోని 26 పదాలతో రూపొందించిన 'తెలుగుజ్యోతి' పుస్తకం ఆధారంగా ఉన్నత పాఠశాలలోని పలు తరగతుల్లో చదువుతున్న 15 మ ంది విద్యార్థులను ఎంపిక చేసుకొని వారికి శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. వారు సులభంగా తమిళం, కన్నడ, మలయాళం నేర్చుకున్నారని నేడు అనర్గళంగా మాట్లాడుతున్నారని తెలిపారు. కేవలం 4 నెలల వ్యవధిలోనే చదవటం,రాయటం మాట్లాడటం నేర్చుకున్నారని తెలిపారు. వారికి ఒక్కొక్క రోజు ఒక్కొక్క భాషకు సంబంధించి శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులు మాట్లాడటం రాయటం చూసిన పరిశీలకులు, తల్లిదండ్రులే ఆశ్చర్యం వ్యక్తం చేసారు. ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య చొరవను అభినందించారు.ఏ భాష అభ్యసనకైనా మొదట మాతృభాషపై పట్టు సాధించాలని వివరించారు. తాను ఎంపిక చేసుకున్న 15 మంది విద్యార్థులు ఎంతో చలాకిగా శ్రద్దగా అభ్యసించారని వివరించారు.ఈ కార్యక్రమాల్లో భాషా నిపుణులు షింజో మైకేల్, ఉష,సులోచన, సిఆర్ఎంటి మునిమోహన్, ఉపాధ్యాయులు అభినయ్ మండల విద్యాశాఖాదికారి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## 3న ఉచిత ఖత్నా:

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తిలోని ముస్లిం పిల్లలకు మే 3న ఉచిత ఖత్నా కార్యక్రమాలు నిర్వహించబడతాయని నిర్వాహకులు షేక్ మీర్జాంసాహెబ్ మంగళవారం వివరించారు. ప్రతి ఏడాది వేసవి లో ఈ కార్యక్రమాలను గత 26 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఈదుల గుంటలోని ఈద్‌గాహ్ షాధీ మహల్‌లో ఉదయం 8గంటల నుంచి ప్రారంభమౌతాయని వివరించారు.ఈ ఒడుగుల కార్యక్రమాలకు వెంకటగిరికి చెందిన డాక్టర్ షేక్ షాజాహన్, అహమ్మద్ బాషాలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉచిత ఒడుగులు చేయించుకునే వారు ఆధార్‌కార్డు జెరాక్స్‌ను తీసుకురావాలని మీర్జాంసాహెబ్ వివరించారు.

## డెప్యూటీ సొలిసిటర్ జనరల్‌కు నివాళులు

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



రాష్ట్ర హైకోర్టులో డెప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ హఠాన్మరణం చెందిన పసల పసల పొన్నారావు పార్థీవ దేహానికి శ్రీకాళహస్తికి చెందిన పలువురు తమ సంతాపాలను తెలుపుతూ నివాళులర్పించారు.ఈ మేరకు బిజెపి నాయకులు జివిఅమర్‌నాథ్ సారధ్యంలో నివాళులర్పించారు. మొదటి నుంచి ఆర్ఎస్ఎస్‌లో ఉంటూ సుశిక్షితులై న కార్యకర్తగా గుర్తింపు పొందారుబిజెపి పార్టీలో వివిధ పదవులు పొందారన్నారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ ఆయన న్యాయవాది కాబట్టి హైకోర్టులో కేంద్రంకు సంబంధించిన కేసులను పరిష్కారానికి బాధ్యతలు అప్పగించారు.ఆయన మరణం బాధాకరమని మాజీ శాసనసభ్యుడు బియ్యపుమదుసూధనరెడ్డి అన్నారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కుటుంబసభ్యులను ఓదార్చారు. కాగా శ్రీకాళహస్తీశ్వరాలయ మాజి ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,సహచరులు పాల్గొన్నారు.

## తేరువీధిలో అన్నదానం

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయం వద్ద మంగళవారం రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఇక్కడ ఉదయం నుంచి దాతలు వివిధ రకాల పానీయాలు అందించారు.భక్తులకు కూల్ కూల్‌గా కొందరులస్సీని పంపిణి చేయగా మరి కొందరు మజ్జిగను పంపిణి చేసారు. రాత్రి అలంకారం తరువాత ముత్యాల చంద్ర సారధ్యంలో పంపిణి చేసారు.ఈ సందర్భంగా చంద్ర మొక్కుబడిగా 51 టెంకాయలను కొట్టి తీర్చుకున్నారు.

## రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షునిగా రవీంద్ర....

**రేణిగుంట ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షునిగా తమ్మిశెట్టి రవీంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ట్లు వడ్డెర సంఘం నేతలు తెలిపారు. వడ్డెర కుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తానని రవీంద్ర తెలిపారు. అనంతరం ఆయన శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసి ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. వడ్డెర కులస్తులకు అండగా ఉండాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా దేవళ్ళ రమణ మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నియోజకవర్గం సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. వడ్డెర సంఘానికి ఎమ్మెల్యే తమ సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను సత్కరించిన వారిలో వడ్డెర సంఘం రాయలసీమ అధ్యక్షులు శ్రీనివాసులు, తిరుపతి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు గుంజి మదనమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవళ్ళ రమణ, జిల్లా కార్యదర్శి వేముల బాల, శ్రీనివాసులు, చంగళ రాయులు, సుధాకర్, సుబ్బు, ఆనందయ్య తదితరులు ఉన్నారు.

## ఏర్పేడు పోలీసుల జవాబుదారి తనం

ఏర్పేడు,ఏప్రిల్ 28 ప్రభాతవార్త



తిరుపతిలో ఓ శుభ కార్యానికి వచ్చిన విశాఖ పట్టణం వాసులు విమానాశ్రయంలో బంగారు కడియంను పొగొట్టుకున్నారు. ఈ మేరకు వారు ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేసారు.మంగళవారం విశాఖ పట్టణానికి చెందిన పి.శివ ఆతని భార్య హిమబిందు తిరుపతిలోని ఓ వివాహానికి హాజరయ్యారు. తిరుగుపయనంలో వారు విమానాశ్రయంలో హిమబిందు చేతిలోని 21గ్రాముల బంగారు కడియాన్ని పొగొట్టుకున్నారు.ఈ మేరకు ఏర్పేడు పోలీసులకు పిర్యాదు చేసారు.ఈ మేరకు సిఐ శ్రీకాంత్‌రెడ్డి చొరవ చూపి విచారణ జరిపారు.ఎట్టకేలకు బంగారు కడియాన్ని సాధించారు. దానిని విశాఖ వాసులకు అప్పగించారు.

## స్విమ్స్‌లో ఉత్కంఠ భరిత వాతావరణం

– కార్మికుల పోరాటంతో స్థంభిస్తున్న సేవలు

**తిరుపతి హెల్త్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**



స్విమ్స్ ఆసుపత్రిలో పరిస్థితులు రోజురోజుకు ఉద్రిక్తంగా మారుతున్నాయి. రెండు సంవత్సరాలుగా అన్యాయం భరిస్తూ, గత 61 రోజులుగా మండుతున్న ఎండల్లో దీక్షలు కొనసాగిస్తున్న కార్మికుల పరిస్థితి చూస్తే ఎవరికైనా హృదయం కదిలేలా ఉంది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ కార్మికుల జీవితాలతో ఇలా ఆడుకోవడం తగదన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని గట్టిగా డిమాండ్ చేశారు. తమ కుటుంబాల కోసం పోరాడుతూనే, న్యాయం కోసం వీధుల్లో నిలబడిన కార్మికుల ఆవేదన రోజురోజుకు పెరుగుతోంది. తాము చేస్తున్న పనులు వార్డు బాయ్‌ల బాధ్యతలకు సమానమైనప్పటికీ, శానిటేషన్ పేరుతో తక్కువ హోదాలో ఉంచి తక్కువ వేతనాలతోనే పనిచేయించడాన్ని కార్మికులు వేదనగా చెబుతున్నారు. అదే పనులు చేసే ఇతరులకు వేతనాలు పెరిగినా, తమను మాత్రం రెండేళ్లుగా పట్టించుకోకపోవడం వారి బాధను మరింత పెంచింది. పెరిగిన ఖర్చులతో కుటుంబాన్ని నెట్టుకొస్తూ, అప్పుల పాలవుతూ జీవించాల్సి వస్తోందని కార్మికులు కంటతడి పెట్టుకుంటున్నారు. ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మి ఎన్నిసార్లు అధికారుల వద్దకు వెళ్లినా, ప్రతి సారి హామీలు మాత్రమే లభించాయి. శానిటేషన్ హోదా తొలగించి సరైన గుర్తింపు ఇస్తామని, వేతన సమస్యలు పరిష్కరిస్తామని పలుమార్లు చెప్పినా, అవి మాటలకే పరిమితమయ్యాయి. లేబర్ అధికారుల సమక్షంలో ఒప్పందాలు కుదిరినా అమలు కాకపోవడం కార్మికులను తీవ్ర నిరాశలోకి నెట్టింది. ఇటీవల టీటీడీ ఈఓగా ఉన్న ముద్దాడ రవిచంద్ర స్వయంగా చర్చలు జరిపి కొద్ది రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన మాట కూడా నెరవేరలేదు. ఇప్పటికే 15 రోజులు దాటినా ఎలాంటి చర్యలు కనిపించకపోవడంతో కార్మికులు మోసపోయామనే భావనలో ఉన్నారు. మాకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం కూడా పోయింది అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షులు ఎస్. జయచంద్ర, జి. బాలసుబ్రమణ్యం, ఎన్. మాధవ్, పి. బుజ్జి, కే. వేణుగోపాల్, స్విమ్స్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి. రవి, అధ్యక్షులు వి. సూరి, కోశాధికారి మారి ముత్తు, గోపి, వెంకటేష్, జనార్ధన్, బి. వెంకటేష్, రాజా, కోటయ్య, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మండలాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం

– ఎమ్మెల్యే ఆదిమూలం



**సత్యవేడు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

నియోజకవర్గ అభివృద్ధి చేయడమే నా లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండల సమగ్ర అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మంగళవారం సత్యవేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలసాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో వీధులు, శ్మశాన వాటికలు, వాటికి రోడ్లు, తాగునీరు వంటిమౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎక్కడైనా తీరని సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం మండలంలోని సమస్యలను ప్రజా ప్రతినిధులు సభలో ప్రస్తావించగా అధికారులు వాటి పరిష్కార మార్గం చూపేందుకు ప్రయత్నించారు.శాఖల వారీగా ప్రగతి నివేదికను అధికారులు సభలో చదివి వినిపించారు.

### న బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

సత్యవేడు దళితవాడలో అగ్నికి ఆహుతై ఇల్లు కోల్పోయిన పుష్పరాజ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా బియ్యం, నిత్యావసర వస్తువులు, రూ.5 వేలు నగదును ప్రభుత్వ తరపున ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే ఆదిమూలం భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు,ప్రజాప్రతినిధులుకూటమిపార్టీలకుచెందినవాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం నియామకం

**సత్యవేడు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**



సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జాన్సన్, వైస్ చైర్మన్‌గా మురళి(చికెన్ చిన్న) నియమితులయ్యారు. ఈ కమిటీకి గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే వ్యవహరిస్తారు. ఈ మేరకు రాష్ట్రఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకంపై ఉత్తర్వులు విడుదల చేశారు. ఇందులో భాగంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నాగలాపురంకు చెందిన దామోధరన్ అలియాస్ జాన్సన్, వైస్ చైర్మన్‌గా సత్యవేడు పట్టణానికి చెందిన మురళి, సభ్యులుగా యుగంధరయ్య, లతను నీత, జయలక్ష్మి, తుపాకుల రవణ, ఉద్ది, సుబ్రహ్మణ్యం, లక్ష్మి, మరియమ్మ, ఏ.కృష్ణారెడ్డి, మందపాటి సురేష్, కొల్లరామగోవిందచౌదరి, కుమార్, మార్కెట్ కమిటీ అధ్యక్షులు, వ్యవసాయ శాఖ ఏడీ నాగలాపురం ప్రత్యేక అధికారి జిల్లా వ్యవసాయ ట్రేడ్ మార్కెట్ అధికారి వ్యవసాయ మార్కెట్ కమిటీలో సభ్యులుగా కొనసాగనున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా ప్రభుత్వం నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీని నియమించింది. ఈ కమిటీ నియామకంలో కూడా టీడీపీ నియోజకవర్గ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి, చక్రం తిప్పినట్లు సమాచారం. ప్రధానంగా శంకర్‌రెడ్డి సిఫార్సు మేరకే కమిటీ సభ్యుల నియామకం జరిగినట్లు తెలుస్తోంది.

## విలేకరి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం - సీపీఐ

**పుత్తూరు రూరల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

పలమనేరు నియోజకవర్గంలోని వీ కోట మండలానికి చెందిన ఓ పత్రికా విలేకరి జగన్మోహన్‌రెడ్డి దారుణ హత్యకు గురి కావడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పుత్తూరు సీపీఐ నాయకుడు మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత విదేశీ పర్యటనలను విరమించి, రాష్ట్రంలో చట్టం శాంతి పరిస్థితులపై దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపి, నిందితులు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులను డిమాండ్ చేశ్వారు.

## ఎరువుల దుకాణాల యజమానుల డిమాండ్లను పరిష్కరించాలి

**పుత్తూరు రూరల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**




ఎరువులు పురుగుల మందులు విత్తన విక్రయ కేంద్రాల యజమానుల డిమాండ్లను పరిష్కరించాలని పుత్తూరు ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీట్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జయరాంనాయుడు భాస్కర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర డీలర్స్ అసోసియేషన్ తెలుగు మేరకు పుత్తూరులో దుకాణాలు మూసి వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులు కంపెనీలు సరఫరాకు సంబంధించి బాడుగలు ఇవ్వడం లేదని ఎరువులు ఇవ్వాలంటే కొన్ని రకాల ప్రొడక్టులు తప్పని సరిగా కొనుగోలు చేయాలని అంటగడుతున్నారన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా తమసమస్యను తెలియజేసేందుకు నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు.

## జామియా మస్‌జిద్‌లో సమ్మర్ క్లాసులు

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని జామియామస్‌జిద్‌లో వేసవి సెలవులతో సంప్రదాయ విద్యాబోధనకు, నేర్చుకోవటానికి 'సమ్మర్‌కోచింగ్' ఏర్పాటు చేసినట్లు హాఫీజె ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ ప్రకటించారు. మంగళవారం ఆయన ఈ మేరకు వివరిస్తూ నేడు చోటు చేసుకున్న పరిస్థితుల దృష్ట్యా క్రమశిక్షణకు,సంప్రదాయాల పట్ల అవగాహనకు సంప్రదాయ విద్య ఎంతో ముఖ్యమన్నారు. మన ప్రవక్తల జీవితాలను అధ్యయనం చేయటానికి ఉర్దూ,అరబ్బీ భాషలు నేర్చుకోవటం ఎంతో ముఖ్యమన్నారు. ఈ సమ్మర్ కోచింగ్ క్లాసులు ఉదయం 9గంటల నుంచి ప్రారంభమౌతాయని వివరించారు.తల్లిదండ్రులు శ్రద్ద వహించి తమ బిడ్డలకు సంప్రదాయ విద్యను అభ్యసించుటకు జామియామస్‌జిద్‌కు పంపాలని రేహాన్ కోరారు.

## నేడు పెనగలూరులో జనవాణి

పెనగలూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త

నేడు పెనగలూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతం శెట్టి నాగేంద్ర, మార్కెట్ చైర్మెన్ పగడాల వరలక్ష్మీ మ్మ ఆధ్వర్యంలో జనవాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జనసేన మండల నాయకుడు యర్రంశెట్టి హరి రాయల్ తెలిపారు.

# తిరుపతి డివిజన్

## గంగ జాతరకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేద్దాం

ఇంచార్జి కమిషనర్ శారదా దేవి

**.తిరుపతి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



తిరుపతి నగరంలో నిర్వహించనున్న తాతయ్యగుంట గంగజాతరకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేసి, విజయవంతం చేయాలని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులకు సూచించారు. గంగజాతర ఏర్పాట్లపై మంగళవారం అన్ని విభాగాల అధికారులతో ఇంచార్జి కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గంగ జాతర లో ఎవరికీ కేటాయించిన విధులను వారు చక్కగా నిర్వహించి విజయవంతం చేయాలని తెలిపారు. ముఖ్యంగా ఆలయ పరిసరాలతో పాటు, నగరంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగ్గా చేపట్టాలని తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా పలు ప్రాంతాల్లో త్రాగునీరు సౌకర్యం, మజ్జిగ పంపిణీ చేయాలని తెలిపారు. అలాగే పోలీస్ అధికారులతో కలసి సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పొంగళ్ళు పెట్టేందుకు మార్కెట్ లో అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొబైల్ టాయిలెట్స్, అగ్ని ప్రమాదాలు జరగకుండా అన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. వాహనాలు ఎక్కడపడితే అక్కడ ఉంచకుండా పోలీస్ అధికారులతో కలసి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జంతు బలులు కేటాయించిన స్థలంలోనే జరిగేలా చర్యలు చేపట్టి, ఎప్పటికప్పుడు నీటితో శుభ్రం చేయాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో వచ్చిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపి ఖాన్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, అర్బన్ తహసీల్దార్ సుధాకర్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

## పాతభవనానికి పూర్వవైభవం

-పోలీస్ శాఖ నుండి వెంటనే స్వాధీనం -జెఈఓ డాక్టర్ శరత్

**తిరుపతి,ఏప్రిల్ 28ప్రభాతవార్త:**



తిరుపతిలోని ఎస్వీ హైస్కూల్ పాత భవనాన్ని టిటిడి జెఈఓ డాక్టర్ ఎ. శరత్ మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు.దాదాపు 150 ఏళ్ల చరిత్ర గల ఈ భవనాన్ని టిటిడి తిరిగి స్వాధీనం చేసుకుని హైస్కూల్‌ను పునఃప్రారంభించాలనే సూచనలు వచ్చాయి.ఈ నేపథ్యంలో భవనాన్ని పరిశీలించాలని జేఈవోకు ఆదేశాలు ఇచ్చారు. దీనిపై స్పందించిన జేఈవో భవనాన్ని పరిశీలించి, పోలీస్ శాఖ నుండి వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అలాగే భవనాన్ని పరిశుభ్రంగా ఉంచడం, మరమ్మత్తులు చేపట్టడం, పచ్చదనం పెంపు, పెయింటింగ్, గదుల అభివృద్ధి వంటి అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి ఎస్టేట్ అధికారి సువర్ణమ్మ, డిఈఓ వెంకటసునీల్, ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మందుతాగి వాహనం నడిపితే కఠిన చర్యలు

– 118 మందిపై కేసులు నమోదు.

**తిరుపతి,ఏప్రిల్ 28ప్రభాతవార్త:**



గత రెండు నెలల్లో మందుత్రాగి వాహనం నడిపిన వాహనదారులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. నిందితులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు లెక్కన మొత్తం 11.80లక్షల రూపాయలు జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, త్రాగి వాహనం నడపవద్దని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

## ఎముకల సాంద్రత పరీక్షలు తప్పనిసరి

-ప్రతి మూడు నెలలకు వైద్యుల సలహా పాటించండి : డాక్టర్ సుకుమార్

**తిరుపతి హెల్త్,ఏప్రిల్ 28ప్రభాతవార్త:**



ప్రతి వ్యక్తి తన జీవితంలో ఎముకల సాంద్రత పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని సాయిసుధ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బి,సుకుమార్ తెలిపారు. 40 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ఎముకల సాంద్రత పరీక్షి ంచుకోవాలని,ఎముకల సాంద్రత పరీక్షలు ప్రతి 3 నెలలకు ఒకసారి ఎముకల వైద్యుల్ని కలిసి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు.ఎక్స రే బోన్ డెన్సిటీ టెస్ట్ పరీక్షలతో ఎముకల సాంద్రతను తెలుసుకొని క్యాల్షియం పరిమాణాన్ని సాధ్యమైనంతవరకు ఆహారం ద్వారానే భర్తీ చేసుకోవాలన్నారు.

### స్థానిక రెడ్డి రెడ్డి కాలనీలోని సాయి సుధా హాస్పిటల్ లో ఉచిత బిఎండి పరీక్షలు

మంగళవారం ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం వరకు నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో ప్రముఖ ఎముకలు, కీళ్ల నరముల వైద్య నిపుణుడు డాక్టర్ బి. సుకుమార్ ,ఇంటస్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ ముంబయి ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు చేయడంతో పాటు సలహాలు సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బా నాయుడు, డాక్టర్ జుబేర్ ,డాక్టర్ హిమబిందు,ఫిజియోథెరపీ డాక్టర్ సునీత,,సుజాత, మహేష్, శీను,హేమంత్,గౌతమ్, ప్రవీణ్, నరేంద్ర, సిస్టర్స్ శ్రీలత,దివ్య, నీలిమ ,ఇంటస్ ఫార్మా కంపెనీ ప్రతినిధి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టును హత్య చేయడం సిగ్గుచేటు !

– డాక్టర్ సుధాకర్ రెడ్డి

**తిరుపతి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



వి.కోటలో విలేకరి హత్య ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చే సంఘటన అని సీనియర్ జర్నలిస్ట్, ఏపీ చైతన్య వేదిక కన్వీనర్ డాక్టర్ ఎన్. బి. సుధాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లు రెచ్చిపోయి పట్ట పగలు హత్యలకు తెగబడుతున్నారంటే రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుందని అన్నారు. పోలీసులు సిగ్గుతో తలదించుకునే పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ఈ హత్యకు పాల్పడిన తమీమ్‌తో పాటు సహకరించిన వారందరినీ తక్షణమే అరెస్ట్ చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపి అత్యంత కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు, వారి భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా కల్పించాలని కోరారు.

## తిరుచానూరులో అన్నప్రసాద కేంద్రాన్ని పరిశీలించిన టిటిడి ఈవో

**తిరుచానూరు ,ఏప్రిల్ 28 ప్రభాతవార్త;**



తిరుచానూరులోని తోళ్లప్ప గార్డెన్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర నిత్య అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని టిటిడి ఈవో శ్రీ ఎం. రవిచంద్ర మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఈవో అన్నప్ర సాద వితరణ విధానాన్ని సమగ్రంగా పరిశీలిస్తూ భక్తులతో నేరుగా మాట్లాడారు. అన్నప్రసాదాల నాణ్యత, సమయపాలన, సేవల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, తాగునీరు, రాత్రి వరకు వితరణ సమయాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు సేకరించారు. అనంతరం అన్నప్రసాద భవనంలోని స్టోర్‌రూమ్, కోల్డ్ స్టోరేజ్, వంటగది, పరిశుభ్రతను పరిశీలించి కూరగాయలు, ఆకుకూరల నిల్వలపై సమీక్షి ంచారు.అదేవిధంగా, ఉపయోగంలో లేని ఫర్నిచర్, పనికిరాని యంత్రాలు, ఇనుము వ్యర్థాలను త్వరితగతిన డిస్పోజ్ చేసేలా నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సిబ్బందికి జీతభత్యాలు సకాలంలో అందుతున్నాయా, ఎలాంటి కోతలు ఉన్నాయా అనే అంశాలపై కూడా విచారణ జరిపారు.ఈ కార్యక్రమంలో సివిఎస్వో శ్రీ కే.వి. మురళీకృష్ణ, అన్నప్రసాద కేంద్రం అధికారి శ్రీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో పఠనమే మా పండుగ



సూళ్లూరుపేట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త: విద్యార్థుల్లో పుస్తక పఠనాభిలాష పెంపొందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌర గ్రంథాలయ శాఖ వారు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు-2026 కార్యక్రమంలో భాగంగా సూళ్ళూరుపేట శాఖా గ్రంథాలయంలో ఈ శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎన్. శ్రీనివాసులు మాట్లాడుతూ నేటి సాంకేతిక ప్రపంచంలో విద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియాకు బానిసలవుతున్న తరుణంలో, వారిని తిరిగి అక్షర ప్రపంచంలోకి ఆహ్వానిస్తూ స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు 2026" నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిక్షణ తరగతుల ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థులలో కేవలం చదవడం మాత్రమే కాకుండా, అర్థవంతమైన పఠనం మరియు పుస్తకాల పట్ల ప్రేమను పెంపొందించడం. ప్రతిరోజూ ఒక గంట పాటు విద్యార్థులకు నచ్చిన కథలు, నవలలు లేదా మహనీయుల జీవిత చరిత్రలను చదివించే కార్యక్రమం, విద్యార్థులు తాము చదివిన అంశాలను తోటి విద్యార్థులకు అర్థవంతంగా వినిపించడం ద్వారా వారిలో ఉచ్చారణ, భావ వ్యక్తీకరణ మెరుగు పడుతుందన్నారు. చదివిన పుస్తకంలోని సారాంశాన్ని విశ్లేషించి, తమ సొంత మాటల్లో వ్రాసేలా ప్రోత్సహించడం జరిగిందన్నారు. అనంతరం విజ్ఞాన సర్వస్వాలు, మాస పత్రికల ద్వారా లోక జ్ఞానాన్ని పెంపొందించడం జరిగిందన్నారు. ఈ పఠన కార్యక్రమం విద్యార్థుల పదసంపదను పెంచడమే కాకుండా, వారి ఊహాశక్తిని, ఆలోచనా దృక్పథాన్ని మారుస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ గ్రంథాలయానికి పంపి, ఈ అక్షర యజ్ఞంలో భాగస్వాములను చేయవలసిందిగా కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిడిసిఎల్ వంక శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# తగ్గు ముఖం పట్టిన...పెట్రోల్ డీజిల్ కొరత ప్రభావం



తిరుపతి,ఏప్రిల్ 28ప్రభాతవార్త:తిరుపతి,చిత్తూరుజిల్లాల్లో అనేక ప్రాంతాల్లో గత రెండు రోజులుగా తీవ్రంగా కనిపించిన పెట్రోల్, డీజిల్ కొరత ప్రభావం క్రమంగా మంగళవారం మధ్యాహ్నానికి తగ్గు ముఖం పట్టింది. ప్రధానంగా తిరుపతి నగరంలో పెట్రోల్ బంకుల వద్ద పరిస్థితి సాధారణ స్థితి కనిపించింది. గత రెండురోజులుగా బంకుల వద్ద కిలోమీటర్ల మేర కనిపించిన వాహనాల క్యూలు ఇప్పుడు గణనీయంగా తగ్గాయి. ఇప్పటికే ఆయిల్ కంపెనీలు అదనపు ట్యాంకర్ల ద్వారా ఇంధన సరఫరాను పెంచడంతో జిల్లాల్లో పరిస్థితి మెరుగుపడుతోంది. పెట్రోల్ బంకుల వద్ద రద్దీ తగ్గి పోవడంతో వాహనదారులు ఊరట చెందుతున్నారు. గత రెండురోజులుగా నాలుగు చక్రాల వాహనాలకు వెయ్యిరూపాయల వరకు మాత్రమే పెట్రోల్ ఇచ్చే పరిమితి ఉండగా, ఈరోజు దానిని రెండువేల రూపాయలకు పెంచారు. ద్విచక్రవాహనాలకు 500 రూపాయల వరకు ఇంధనం అందిస్తున్నారు. నిన్నటి వరకు గంటన్నరకు పైగా క్యూలో నిలబడి పెట్రోల్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండగా, మంగళవారం సాయంత్రానికి 10 నిమిషాల్లోనే ఇంధనం లభిస్తోందని వాహనదారులు చెబుతున్నారు. జిల్లాలో పెట్రోల్ బంకుల వద్ద ఇంధన సరఫరా సాధారణ స్థితికి చేరుకుంటోందని అధికారులు తెలిపారు. బంకుల వద్ద నో స్టాక్ బోర్డ్స్ లేకుండా చూడాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. మొత్తానికి పెట్రోల్, డీజిల్ కొరతతో ఇబ్బందులు పడ్డ ప్రజలకు ఇప్పుడు కొంత ఊరట లభించింది. రానున్న రోజుల్లో సరఫరా పూర్తిగా సాధారణ స్థితికి చేరుతుందని అధికారులు భావిస్తున్నారు.

## తిరుచానూరుశ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ఉప రాష్ట్రపతి



తిరుచానూరు ,ఏప్రిల్ 28 ప్రభాతవార్త; శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ఉప రాష్ట్రపతి సి పి రాధాకృష్ణన్ భారత ఉప రాష్ట్రపతి శ్రీ రాధాకృష్ణన్ మంగళవారం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఉపరాష్ట్రపతికి అర్చకులు సంప్రదాయబద్ధంగా ఇస్తికాఫాల్ స్వాగతం పలికారు. ఆయన ఆలయంలోని ధ్వజస్తంభానికి మొక్కుకుని శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వాద మండపంలో టీటీడీ ఈవో . రవిచంద్ర అమ్మవారి ప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టీటీడీ బోర్డు సభ్యులు జి. భానుప్రకాష్ రెడ్డి, జేఈవో వి వీరబ్రహ్మం, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, తిరుచానూరు ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## షణ్ముఖ స్వామికి ప్రత్యేకాభిషేకాలు



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని పలు సుబ్రమణ్యం స్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేకా భిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాలతోపాటు ఆలయంలో సుబ్రమణ్యం స్వామి ఆలయాలు వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వళ్ళి దేవసేన సమేత చెంగల్వారా యస్వామి ఆలయం ఉంది. ఇక్కడ మంగళవారం స్వామి అమ్మవార్లకు ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. ఇక బిక్షాల గాలిగోపురం నుంచి ప్రవేశించిన వెంటనే రంగుల గోపురం వద్ద వళ్ళి దేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి ఆలయం ఉంది. అలాగే ప్రత్యేకంగా కుమారస్వామి తిప్పపై సుబ్రమణ్యం స్వామి వెలసి ఉన్నారు.

**షణ్ముఖ స్వామికి ప్రత్యేకాభిషేకాలు:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని పలు చోట్ల సుబ్రమణ్యం స్వామి ఆలయాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో తేరువీధిలో షణ్ముఖ స్వామి ఆలయం వెలసి ఉంది.ఇక్కడ ప్రతి మంగళవారం స్వామికి విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. షోడషాభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో వందలాది లీటర్ల పాలతో అభిషేకం జరపటం జరుగుతుంది. పట్టణంలోని నలుమూలల నుంచి భక్తులు మంగళవారం వేకువ జాము నుంచి భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకుంటున్నారు.ఈ నేపథ్యంలో మంగళవారం స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు.కొందరు భక్తులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదాలను అందించారు. సాయంత్రం స్వామికి కన్నులు మిరుమిట్లు కొల్పునట్లు అలంకారాలు నిర్వహించారు. ఉదయం నిర్వహించిన చందనాలంకారం భక్తులకు ఇట్టే ఆకట్టుకుంది.

## ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు సాదర వీడ్కోలు





రేణిగుంట ఏప్రిల్ 28 ప్రభాతవార్త : భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ కు రేణిగుంట విమానాశ్రయంలో మంగళవారం సాగర వీడ్కోలు లభించింది. రెండు రోజుల తిరుమల తిరుపతి పర్యటన ముగించుకుని రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎక్స్ అఫ్సియో రెవిన్యూ ఎండోమెంట్ సెక్రటరీ హరి హరి జవహర్ లాల్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి బాజ్పేయి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ ఆచారి, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాశ్ రెడ్డి, రేణిగుంట తహసిల్దార్ శ్యాం ప్రసాద్, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు వీడ్కోలు పలికారు వారిలో ఉన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు - కడ పి.డి. వికాస్ మర్మత్



కుప్ప ం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : గ్రంథాలయా లు విజ్ఞాన నిలయాలు అని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నవదిశ కేంద్రంలో ఉన ్న గ్రంథాల యంలో విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరంను కడ పి.డి. ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వేసవిలో పిల్లలకు ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ వివిధ రకాల శిక్షణ ఇవ్వడం మంచి కార్యక్రమం అన్నారు. తద్వారా పిల్లల్లో మేధోశక్తి పెరుగుతుందన్నారు. గ్రంథాలయాల పట్ల ప్రజలు కూడా ఆసక్తి చూపాలన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం లో ప్రజల సౌకర్యార్థం డిజిటల్ లైబ్రరీని అందుబాటులో తెచ్చామన్నారు. పిల్లలు కూడా ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్త విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతిభను మెరుగుపరచుకునేందుకు ఈ శిక్షణ తరగతులు చక్కటి అవకాశం అన్నారు. కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, ఆదిత్యబిర్లా సంస్థ మేనేజర్ ప్రవీణ్, రిసోర్స్ పర్సన్ కనకవల్లి, లయన్స్‌క్లబ్ సభ్యుడు ప్రసాద్ పాల్గొన్నారు.

## కృత్రిమ ఇసుక తయారీ కేంద్రాలపై..డిఎస్పీ ఆకస్మిక దాడులు

**- జెసిబితో తయారీ స్థావరం ధ్వంసం !!**



కుప్పం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : తెల్ల బంగా రంగా పిలవబడే ఇసుక స్థానంలో కృత్రిమంగా ఇసుకను తయారు చేసే రెండు కేంద్రాలపై కుప్పం డిఎస్పీ పార్థ సారథి ఆకస్మిక దాడులు నిర్వ హించారు. గుడుపల్లె మండలం కనమనపల్లి వద్ద కృత్రిమ ఇసుకను తయారు చేసే రెండు స్థావరాలపై అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. అక క్కడ మట్టి ద్వారా ఇసుకను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయంగా తగు చర్యలు తీసుకోవాలని భూగర్భగనుల శాఖ, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. కృత్రిమ ఇసుక తయారీ స్థావరాలను దగ్గరుండి ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో ఎవరైనా కృత్రిమ ఇసుక తయారీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమంగా కృత్రిమ ఇసుక, మైనింగ్‌లకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికే ఈ విషయంగా పలుమార్లు హెచ్చరికలు జారీ చేశామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, గుడుపల్లె ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## విలేకరి హత్య అత్యంత బాధాకరం

**ఎమ్మెస్ ఎంఈ డైరెక్టర్ చినబాబు**



రామచంద్రాపురం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త: వీకోట మండలం ఓ పత్రికా విలేఖరి జగన్మోహన్ రెడ్డి హత్య బాధాకరమని ఎమ్మెస్ ఎంఈ డైరెక్టర్ చినబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రామచంద్రపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విలేకరిపై అమానవీయ ఘటన జరగడం శోచనీయమన్నారు ప్రజాస్వామ్యానికి నాలుగవ స్తంభమైన విలేకరిపై జరిగిన హత్య తనను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. కలిగిస్తే ఎంతటి వారిని కఠిన చర్యలు తీసుకోవాలన్నారు జగన్ మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

## జర్నలిస్టు హత్య దారుణం




తిరుపతి హెల్త్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త: వీకోటకు చెందిన ఓ పత్రికా విలేకరి హత్యను నిరసిస్తూ తిరుపతి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతికి చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. మృతుడు జగన్మోహన్ హత్య ఘటన తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ నిజాలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయులపై దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. హత్యకు పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక ప్రెస్ క్లబ్ ప్రతినిధులు సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రచనల పట్ల యువత ఆకర్షితులు కావాలి




తిరుపతి విద్య, ఏప్రిల్ 28 ప్రభాతవార్త: నేటి సాంకేతిక ప్రపంచంలో యువత సోషల్ మీడియాకు బానిసలు కాకుండా సాహిత్యం పట్ల అభిరుచి పెంచు కుని న వ జా జ వి ా త వై ా న రచనలపై ఆసక్తి పెంచుకోవాలని ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి రాజేశ్వ రమ్మ, ప్రాచ్య పరిశోధన సంస్థ సంచాలకులు పీసీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.మంగళవారం ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ సౌజన్యంతో వేమన విజ్ఞాన కేంద్రం,సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఎస్వీయూ సైకాలజీ సెమినార్ హాల్లో యువ రచయితలకు కథ, కవిత్వం పై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసి నేటి సమాజంలో కథలు, కవిత్వాలు,రచనలు చేయాల్సిన విధానం, ప్రాచీన, ఆధునిక కాలానికి మధ్య వ్యత్యాసం,ఆలోచనలలో మార్పులు వంటి అంశాలపై యువతకు అవగాహన కల్పించారు. యువత రచనలవైపు మొగ్గు చూపుతూ సమాజంలో జరిగే పరిణామాలపై సాహిత్య రూపంలో స్పందించాలని సూచించారు.అనంతరం అతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మల్లారపు నాగార్జున, ఓ వెంటరమణ,ఉమామహేశ్వర్ రావు, ప్రముఖ రచయతలు కృష్ణస్వామి,మధురాంతకం నరేంద్ర, మన్నవ గంగాధర ప్రసాద్, నెమిలేటి కిట్టన్న, పేరూరు బాలసుబ్రమణ్యం, యువశ్రీ మురళి, పత్తిపాటి రమేష్ నాయుడు, తాతయ్య, సురేంద్ర రొడ్డా, నెల్లూరు మునిలక్షి ్మ, మహేష్ బాబు, గుత్తా హరి సర్వోత్తమనాయుడు, జయపాల్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి కె మోహన్, వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు నారాయణ, డాక్టర్ సాయిలక్షీ ్మ, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## సంస్కృత జ్ఞానాన్ని ప్రపంచానికి చాటాలి



తిరుపతి విద్య, ఏప్రిల్ 28 ప్రభాతవార్త: సంస్కృ తంలోని విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా అడుగులు పడాలని రష్యాలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఐసీఎస్టిఐ దౌత్యకార్యాలయ ప్రతినిధి దేవ కౌశిక్ పిలుపునిచ్చారు.మంగళవారం ఆయన జాతీయ సంస్కృత వర్సిటీని సందర్శించి వర్సిటీ వీసీ, అధికారులు,అధ్యాపకులతో సంస్కృత విజ్ఞా నం, సాంకేతిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు ఇలాంటి సమావేశాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ప్రత్యేకించి జోతిష్యం, గణితంలోని పలు అంశాలను వెలికితీసి నూతన పాఠ్యాంశాలుగా నిర్మించి వాటిని ప్రపంచంలోని విశ్వవిద్యాలయాలో పలు కోర్సుల రూపంలో భాగస్వామ్యం చేస్తేనే సంస్కృతం మరింత ఉన్నత స్థితికి చేరుతుందని చెప్పారు. అనంతరం వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు సంస్కృత శాస్త్రాలలోని వివిధ వైజ్ఞానంతో పాటు సాంకేతిక విషయాలపై రీసెర్చ్ చేసి,ఆధునిక తరానికి అందించేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో డీన్లు ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, ప్రొఫెసర్ విష్ణుబట్టాచార్యులు, పలు విభాగాధికారులు, పీఆర్ ప్రొఫెసర్ రమేష్ బాబు, ఏపీఆర్వో డాక్టర్ కనపాల కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## విలేకరిని హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



పెనగలూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త: రైల్వే కోడూరు నియోజకవర్గం పెనమలూరు మండలం: చిత్తూరు జిల్లాలో ఓ పత్రిక విలేకరి జగన్ మోహన్ రెడ్డిని హత్య చేసిన వారిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని పెనమలూరు మండలం పాత్రికేయులు మంగళవారం పెనగలూరు తహశీల్దార్ సుమనికి, పోలీసు స్టేషన్‌లో హెచ్.సి చంద్రకు వినతి పత్రం ఇచ్చారు. హత్యకు కారణం అయిన వారు ఎంతటి వారు అయిన కఠినంగా శిక్షించాలన్నారు. జర్నలిస్ట్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని, భద్రత కల్పించాలని కోరారు. నిత్యం జర్నలిస్ట్ పై దాడులు, వేధింపులు, హత్యలు జరుగుతున్నాయని రాష్ట్రంలో పాత్రికేయులకు భద్రత లేకుండా పోతుందన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ముగిసిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు



సూళ్లూరుపేట, ఏప్రిల్ 28 ప్రభాత వార్త: సూళ్లూరుపేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆదివారం ప్రారంభమైన 13వ ఆరాధన ఉత్సవాలు మంగళవారం వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి కళ్యాణ మహోత్సవం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఈ ఆరాధన ఉత్సవాలకు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మంగారి మఠానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో కార్యనిర్వాహకులు చిట్టేటి పెరుమాళ్ళు స్వాగతం పలికి పూజల అనంతరం ఘనంగా సన్మానించారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నేల తాళాలతో బాణసంచా వేడుకలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతో రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ ఎజి కిషోర్, తిరుమురు సుధాకర్‌రెడ్డి, బట్ట సుబ్రహ్మణ్యం, చంగయ్య, చిట్టేటి రామదాసు, వినోద్ కుమార్, విజయ్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు పరిశీలన



తడ, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మండల ఎంపీడీవో శేఖర్ నాయక్ మంగళవారం పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు ఉపయోగపడే విధంగా పంట కాలువలు శుభ్రం చేయాలని సూచించారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో ఉపాధి హామీ పనుల కూలీలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు మాంబట్టు గ్రామ చెరువులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో శేఖర్ నాయక్ పరిశీలించారు వారి వెంట ఏపీఓ నాగరాజు గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మ పాల్గొన్నారు.

## నాడు ముద్దన్న ఆలోచనే... నేటి వారపు సంత

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : పుత్తూరు ప్రజల సౌకర్యార్థం సంత ఏర్పాటు చేయాలని దివంగత నాయకుడు తన తండ్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు చేసిన ఆలోచనే ఫలితమే ప్రస్తుత పుత్తూరు మార్కెట్ యార్డ్‌లో వారపు సంత ఏర్పాటు అని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆయన వారపు సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పుత్తూరు పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న కూరగాయల సంతను ప్రారంభించడం సంతోషంగా వుందన్నారు. ఈ సంతలో వ్యాపారస్తుల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయరని స్పష్టం చేశారు. అటు రైతులకు గిట్టుబాటు ధర, ఇటు ప్రజలకు తక్కువ ధరకు కూరగాయలు లభిస్తాయని తెలిపారు. త్వరలోనే రైతు బజారు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అనంతరం సంతలో కూరగాయలు విక్రయించే మహిళలను కలిసి వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ డి.ఎస్.గణేష్, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శక్తివంతమైన సమాజ నిర్మాణానికి బోధనే పునాది



తిరుపతి విద్య, ఏప్రిల్ 28 ప్రభాతవార్త: శక్తివంతమైన సమాజ నిర్మాణానికి పరివర్తనాత్మక బోధనే పునాది అని ఎస్వీయూ ప్రొఫెసర్ హిమాచలం దాసరాజు పేర్కొన్నారు. మంగళవారం ఎస్పీడబ్ల్యూ పాలిటెక్నిక్ కళాశాలలో పరివర్తనాత్మక బోధన ద్వారా స్థితిస్థాపకత, సమన్వయ సమాజ నిర్మాణం, సవాళ్లు, వ్యూహాలు అనే అంశంపై అధ్యాపకులకు ప్రత్యేక ఓరియంటేషన్ సెషన్ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మట్లాడుతూ తరగతి గదుల్లో ఆధునిక టెక్నాలజీ,ఏఐ పరిజ్ఞానంతో బోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు.అధ్యాపకులు సాంప్రదాయ పద్ధతులను విడనాడి విద్యార్థులకు సాంకేతిక ఆధారిత బోధన చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.అనంతరం ఆయనను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం పద్మావతమ్మ, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్‌కు మద్దతుగా టిడిపి నాయకుల భారీ ర్యాలీ



రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : రాష్ట్ర మంత్రి నారా లోకేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన సందర్భంగా రైల్వేకోడూరు పట్టణంలో మంగళవారం టిడిపి శ్రేణులతో భారీగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ చిట్వేల్ రోడ్డులోని విజయ కన్వెన్షన్ నుండి టోల్గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఖాదీ పరిశ్రమల శాఖ రాష్ట్ర చైర్మన్ కేకే చౌదరి, రాష్ట్ర నాయకులు విశ్వనాథ నాయుడు,టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్,బత్యాల చంగల్ రాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర్ నాయుడులు కార్యకర్తలతో ర్యాలీని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి క్రియాశీలకంగా పనిచేస్తూ రాష్ట్రానికి దిక్సూచిగా పనిచేస్తున్న ఏకైక నాయకుడిగా చక్కటి రాజకీయ పటిమను ప్రదర్శిస్తూ రాష్ట్రంలో టిడిపికి వెన్నెముకగా పనిచేస్తున్న నారా లోకేష్ రాష్ట్రంలోనే రాజకీయాలే కాకుండా దేశ రాజకీయాలలో కూడా చక్రం తిప్పే నాయకుడిగా ఎదుగుతున్న తరుణంలో నారా లోకేష్ కు తిరుగులేని అభిమానాన్ని అందరం కోరుకుంటున్నామని వారు అన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అంచలంచలుగా అమలు చేస్తూ విజయ దుందుభి మోగిస్తున్నారని రానున్న రోజుల్లో మరిన్ని పదవులను అలంకరించాలని వారు ఆకాంక్షించారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో టిడిపికి చెందిన బొక్కసం సునీల్, పోతురాజు నవీన్, హేమ రాజ్, తులసి వెంకటేశ్వర్లు, కస్తూరి దినేష్, మల్లెం హేమంత్, హరికుమార్, అంకిపల్లి మధు తో పాటు రైల్వేకోడూరు, చిట్వేలి,ఓబులవారిపల్లి తదితర మండలాలకు చెందిన టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.




# తిరుపతి డివిజన్

# ఆర్‌డియస్ ఎస్ పథకాన్ని జూన్‌లోపల పూర్తి చేయాలి

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో ప్రతి గ్రామానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా పథకం ను జూన్ 26 నాటికి పూర్తి చేసి సహాకరించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి విద్యుత్ శాఖ అధికారులను కోరారు. మంగళవారం ఎంఎల్‌ఏ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ అధికారులతోకూటమి ప్రభుత్వం లక్ష్యం అన్ని వర్గాలు సుఖసంతోషాలతో ఉండాలన్నది. ముఖ్యం గా గ్రామాల్లోని రైతులకు నిరాటంకంగా 9గంటల విద్యుత్‌తో పాటు నాణ్యమైన విద్యుత్‌ను ఇవ్వటానికి ఉద్దేశించిన ఆర్‌డియస్,ఎస్ పథకంను సాధించుటకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, డెప్యూటి స ఎం పవన్‌కళ్యాణ్ ఎంతో శ్రమపడ్డారని తిరుపతిజిల్లాలో శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయిక ప్రాధాన్యత కల్గిన ప్రాంతంగా ఉందన్నారు. ఇక్కడ వ్యవసాయం బోర్లు,బావుల మీద ఆధారపడి సాగిస్తున్నారని అధికారులకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రం సాధించిన ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసుకుంటే రైతులకు ప్రయోజనకారిగా ఉంటుందని అధికారులకు వివరించారు.ఈ సందర్భంగా ఎక్కడెక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. లో ఒల్టేజి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి విద్యుత్ శాఖ ఎస్ఇ చంద్రశేఖర్‌రావును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**పుణ్యక్షేత్రంలో అంతరాయం లేకుండా ఇవ్వండి:**

**విద్యుత్‌శాఖాధికారులతో ఎంఎల్‌ఏ సమీక్ష**

శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయం పరంగానే కాకుండా వ్యాపార కకేంద్రంగా ఉందని పుణ్యక్షేత్రం కాబట్టి ప్రస్తుతం వేసవి కావటంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని కాబట్టి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా నాలుగుమాడావీధుల్లో ఆలయ పరిసరాల్లో ఎటువంటి పరిస్థితిల్లోనూ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని సూచించారు. వేసవి సమయంలో ఎండలు తీవ్రంగా ఉందని ఈ సమయంలో ఏదో కారణాలతో అంతరాయం కల్గితే జనం ఇబ్బంది పడతారని అధికారులకు సూచించారు. పట్టణంలో నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని పల్లెల్లో ప్రజలకు అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ఇబ్బంది కల్గించవద్దని అధికారులకు సూచించారు. ఎక్కడైనా మరమ్మత్తులు చేపట్టాల్సి ఉంటే వెంటనే మంజూరు చేయాలని ఎస్ఇ చంద్రశేఖర్‌రావుకు ఎంఎల్‌ఏ సూచించారు.కరెంటు బిల్లులపై ప్రజలు చర్చించుకకుంటున్నారని ఈ అంశానికి సంబంధించి ఎంఎల్‌ఏ వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో ఎస్ఇ చంద్రశేఖర్‌రావు, డిఇ చిన్నరెడ్డెప్ప,ఎడిఇ సుబ్రమణ్యం,సుదాకర్,ఎఇలు శివం,చెంచుకృష్ణయ్య, శివప్రసాద్ బాలాజి,రాజేష్

## చిలమత్తూరు కమ్మ వీధిలో నీటి సమస్యపై ఎంపీడీఓ హామీ

వరదయ్యపాలెం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త



మండలం లోని,చిలమత్తూరు గ్రా మం కమ్మ వీధిలో నెలకొన్న తాగు నీటి సమస్యపై క్షేత్ర స్థాయిలో పరిశీ లించి డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగ రాజు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీఓ విజయమ్మ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకొని, సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో చర్చించి, తక్షణ చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి నీలిమ, పంచాయతీ కార్యదర్శి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్వేటినగరంలో వృద్దులకు అన్నదానం

కార్వేటినగరం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:



కార్వేటినగరంలోని రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాంధీ వృద్దాశ్రమంలోని వృద్దులకు మండలంలోని యన్.ఆర్.కండ్రిగకు చెందిన యలవర్తి బాస్కర్‌రాజు 6వ వర్ధంతి సందర్భంగా భార్య శారద,కుమారులు చంద్రశేఖర్‌రాజు,లోకేష్‌రాజు,కిశోర్‌రాజు,కోడళ్ళు పూర్ణిమ,రజిత,మనవళ్ళు కూనాల్,గోపాల్‌రాజు, రాహుల్,దుశ్యంత ్రాజులు వృద్దులకు అన్నదానం,పండ్లు,తినుబండారాలు ఏర్పాటు చేయడం జరిగింది.కార్యక్రమంలో కె.మణి,కె.ధనశేఖర్‌యాదవ్,సూపర్‌వైజర్ ప్రకాష్,వృద్దులు పాల్గొన్నారు.

## పెట్రోల్‌బంకును తనిఖీ చేసిన తాహశీల్దార్ నాగరాజు

కార్వేటినగరం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:



కార్వేటినగరం పంచాయితి పరిధిలోని ధర్మరాజుల ఆలయం వద్ద వున్న పెట్రోల్‌బంకును మండల తాహశీల్దార్ నాగరాజు మంగళవారం తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపెట్రోల్‌బంకులో వినియో గదారులకు పెట్రోల్,డీజల్ సకాలంలో అందించాలన్నారు. ప్రస్థుతం ఈ బంకులో పెట్రోల్ మాత్రం 4వేల లీటర్లు వుందని,డీజల్ పూర్తిగా అయిపొయ్యిందని అన్నారు.డీజల్‌కు సంబంధించిన నగదును చెల్లించడంతో సాయంత్రం 6 గంటలకు డీజల్ అందుబాటులో వుంటుందని బంకు నిర్వాహ కులు తెలిపారు.అలాగే కార్వేటినగరంలోని మరో రెండు పెట్రోల్‌బంకులను కూడా వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరారు.ఆర్ఐ నరసింహులు,విఆర్ఓ మోహనమ్మలు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థ బలోపేతానికి "బడి పిలుస్తుంది ప్రచార రధం"

### ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత ఎంఎల్ఏ పులివర్తి నాని

చంద్రగిరి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:




విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం బడి పిలుస్తుంది ప్రచార రధాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని తెలిపారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బడి పిలుస్తుంది కార్యక్రమానికి ఎంఎల్ఏ ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రచార రధాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో డిప్యూటీ సిఎం కొణిదెల పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సంయుక్త ఆధ్వర్యంలో నూతన ఆలోచనలతో విద్యా వ్యవస్థ బలోపేతానికి విశేష కృషి జరుగుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, పేరెంట్స్ ప్రభుత్వ బడిలో విద్యార్థులకు లభిస్తున్న సౌకర్యాలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతి కుటుంబానికి వివరించి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ఆర్‌జెడి శ్యామ్యూల్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలకు మించి అడ్మిషన్లు వుండాలని ఉపాధ్యాయులకు సూచించారు. డిఈఓ కె.వి.ఎన్.కుమార్ మాట్లాడుతూ ప్రతి మండలానికి బడి పిలుస్తుంది ప్రచార రధాన్ని పంపించి ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించే కార్యక్రమం ఉపాధ్యాయులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డివైఈఓ ఇందిరాదేవి, ఎంపిడిఓ అమర్‌నాథ రెడ్డి, ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ-2 భాస్కర్‌బాబు, మార్కెట్‌యార్డు చైర్మన్ గౌస్‌భాషా, టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, హెచ్‌ఎంలు శారద, వెంకటరమణ రెడ్డి, ధర్మినేని జగదీష్, పంచాయతీ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

### తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరి

చంద్రగిరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



మండల వ్యాప్తంగా గల పెట్రోల్ బంకుల నిర్వహకులు కృత్రిమంగా కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరి హెచ్చరించారు. మండల పరిధిలోని 8 పెట్రోల్ బంకులను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొంత కాలంగా వినియోగదారులు పెట్రోల్ కొరకు ఒక్కసారిగా క్యూ కట్టడంతో డిమాండ్ విపరీతంగా పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఓ పెట్రోల్ బంకుల డీలర్స్‌తో సమావేశమై సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఇకపై వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ కొరత వుండదని అన్నారు. అన్ని పెట్రోల్ బంకులకు అవసరమైన మేరకు చమురు నిల్వలు చేరినట్లు తెలిపారు. వినియోగదారులు ఆందోళనకు గురికావదన్నారు. పెట్రోల్ బంకుల నిర్వహకులు క్యాన్లకు, బాటిల్స్‌కు

## నేడు ప్రమాణ స్వీకారం



శ్రీకాళహస్తి ఏప్రిల్ 28 ప్రభాతవార్త

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మాసారపు. సుబ్బయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ఐటివిద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసులు, శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్య లు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శిగా బుధవారం, ఉదయం 10 గంటలకు విజయవాడ మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న శుభ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నాయకులకు శుభాభినందనలు మరియు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పదవి తనకు మరింత బాధ్యతలు పెంచిందన్నారు.

## పెట్రోల్, డీజిల్ ఇంధన కొరతను తీర్చండి

### సిపిఐ డిమాండ్

శ్రీకాళహస్తి ఏప్రిల్ 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రజలకు పెట్రోల్, డీజిల్ కొరతను తీర్చాలని సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత నాలుగు రోజుల నుండి పెట్రోల్, డీజిల్ ఇందనం లేకపోవడంతో పెట్రోల్ బంకులలో బొంకుల యజమానులు నో స్టాక్ బోర్డులు పెట్టడంతో ప్రజలు, రైతులు, ఆటో కార్మికులు నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు నిన్నటి దినం ఈ జిల్లా ప్రథమ పౌరుడు అయినటువంటి జిల్లా కలెక్టర్, ఎస్పీ గార్లు పెట్రోల్ డీజిల్ జిల్లాలో పుష్కలంగా ఉన్నాయని సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మొద్దని వారు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మంగళవారం కూడా పెట్రోల్ బంకులు ముందు నో స్టాక్ బోర్డులు శ్రీకాళహస్తిలో పెడుతున్నారని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఈ సమస్య పైన స్పందించి వెంటనే ప్రజలకు పెట్రోల్ డీజిల్ అందుబాటులో ఉండేటట్లు చూడాలని కోరారు. లేనిపక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేస్తున్నామన్నారు.

## జర్నలిస్టు హత్యకు నిరసనలు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త




వికోటలో జర్నలిస్టు హత్యకు శ్రీకాళహస్తిలో నిరసనలు నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని జర్నలిస్టులు మంగళవారం ఉదయం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసనలు తెలిపారు.ఎంఆర్ఓ పివి సుబ్రమణ్యంకు వినతి పత్రం అందించారు.జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని అభ్యర్థించారు.కాగా సాయంత్రం శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ తరఫున అధ్యక్షుడు వేణుగోపాల్,కార్యదర్శి ఈశ్వర్‌ల పర్యవేక్షణలో గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా వారు నాలుగుమాడావీధుల్లో కొవ్వొత్తులతో ప్రదర్శన జరిపారు.జగన్‌మోహన్‌రెడ్డి అమర్ రహే, మీడియాపై దాడులు,దౌర్జన్యాలు హత్యలను ఖండించాలని నినాదాలు చేసారు. దేవస్థానం సమాచార కేంద్రం కూడలిలో మానవహారం నిర్వహించారు. కాగా శ్రీకాళహస్తి టౌన్ పోలీసు స్టేషన్‌లో సిఐ ప్రకాష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు.

## మాదకద్రవ్యాల జోలికి వెళ్తే జీవితాలు నాశనం....

రేణిగుంట ఏప్రిల్ 28 ప్రభాతవార్త



గంజాయి లాంటి మాదకద్రవ్యా లకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని అనంత పురం రేంజ్ ఐజి షిమోషి వాజ్పా య్, తిరుపతి ఎస్పీ సుబ్బరా యుడు సంయుక్తంగా అన్నారు. జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి పై జరిగిన దాడుల్లో పట్టుబడిన దాదాపు 5 కోట్ల 32 లక్షల విలువైన 1064 కేజీల గంజాయిని చట్టబద్ధంగా మంగళవారం రేణిగుంట మండలం తూకివాకం వర్మి కంపోస్ట్ ప్లాంట్ వద్ద అనంతపురం రేంజ్ ఐజి షిమోషి వాజ్పేయి, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు సమక్షంలో పోలీసులు ధ్వంసం చేసి ఆపై దగ్ధం చేశారు. మాదకద్రవ్యాలు ఉత్పత్తి చేసినా, రవాణా చేసినా, సరఫరా చేసినా చర్యలు కఠినంగా ఉంటాయని అధికారులు హెచ్చరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే ఈగల్ టీం టోల్ ఫ్రీ నెంబర్ 1072, లేదా పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్ 112 కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. పదేపదే మాదకద్రవ్యాల నేరాలకు పాల్పడిన 16 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్టు తెలిపారు. గంజాయి పై విద్యాసంస్థలు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం విజిలెన్స్ ఎంఫోర్స్మెంట్, ఈగల్ టీం, ఎక్సైజ్ శాఖ, పోలీసులు ప్రత్యేక నిఘా ఉందన్నారు. ఎవ్వరు ఎట్టి పరిస్థితుల్లో చట్టం నుండి తప్పించుకోలేరన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ షరీఫ్, అడిషనల్ ఎస్పీలు, వివిధ సబ్ డివిజన్లు, ఎక్సైజ్ శాఖ, ఈగల్ టీం, ఇంటలిజెన్స్ అధికారులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ జిల్లా మహిళా మోర్చ కార్యదర్శిగా వై.ఇందుమతి



వరదయ్యపాలెం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ తిరుపతి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా వరదయ్యపాలెం మండలం వెంగారెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన వై.ఇందుమతి నియమితులయ్యారు. ఈ మేరకు మహిళా మోర్చా నూతన కార్యవర్గాన్ని బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్ష రాలు వికేయం ప్రజ్ఞశ్రీ సోమవారం రాత్రి ప్రకటించారు. మహిళా మోర్చా కార్యదర్శిగా ఎంపికైన ఇందుమతి గత కొన్ని ఏండ్లుగా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ఈ ప్రాంతంలో భారతీయ జనతా పార్టీ పటిష్టతకు కృషి చేస్తోంది.ఈ నేపథ్యంలో మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా ఇందుమతి నియమితులైయ్యారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రజ్ఞశ్రీకి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.కార్యదర్శిగాఇందుమతి నియామకంపై స్థానికబిజెపినాయకులు,కార్యకర్తలుహర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వం వెంటనే ప్రత్యేక రక్షణ యంత్రాగం ఏర్పాటు చేయాలి

### - ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. గిరిబాబు డిమాండ్

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త

రాష్ట్రస్థాయిలో పాత్రికేయుల రక్షణకు వారి హక్కులను కాపాడడానికి తక్షణమే ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. గిరిబాబు డిమాండ్ చేశారు. విలేకరి జగన్మోహన్ రెడ్డి కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని, ఆ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.50 లక్షలు పరిహారం అందించాలన్నారు. దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను చేపడతామని ఆయన హెచ్చరించారు.

## ఇంత కాలం లేని నిబంధనలు ఇప్పుడెందుకు?

### హెచ్‌పి గ్యాస్ వింత ధోరణి

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని పానగల్‌లో గ్యాస్‌ఏజెన్సి గతంలో లేని నిబంధనతో ఇబ్బంది పెడుతున్నారని ఓ వినియోగదారుడు ఆరోపించారు.ఇటీవల గ్యాస్ కొరత ఉన్న సమయంలో కొత్త నిబంధనలతో ఇబ్బందులు కల్గించటం శోచనీయం అన్నారు. తాను సుమారు 45 సంవత్సరాల నుంచి హెచ్‌పి గ్యాస్‌ను వాడుతున్నట్లు వివరించారు. తాము శ్రీరామనగర్ కాలనీలో ఉంటున్నామన్నారు. తాము బుకింగ్ చేసుకున్నామన్నారు.అయితే డెలివరి బాయ్ 'పుస్తకం ఉంటేనే' తాను డెలివరిఇవ్వలేనంటూ మొరాయించారన్నారు.కార్యాలయానికి వెళ్ళి ఫిర్యాదు చేస్తే బుక్‌లేకుండా ఇవ్వలేమంటూ సమాధానం చెప్పారన్నారు. ఇంతకాలం లేని నిబంధనలు ఇప్పుడెందుకు? అంటూ ప్రశ్నించారు.ఒక వేళ కొత్తగా నిబంధనలతో పుస్తకమే కావాలంటే ఒక సారి సూచించి గ్యాస్ ఇవ్వవచ్చు కదా? అని ప్రశ్నించారు.ప్రభుత్వ ఉత్తర్వులు ఉండవచ్చు కానీ కొత్త బుక్ కావాలంటే సవాలక్ష నిబంధనలు సూచిస్తున్నారని బాధితుడు వివరించారు.

## బాబు వచ్చారు... గూగుల్ తెచ్చారు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త




భవిష్యత్ తరాలకు ఒక అద్భుతమైన ఆంధ్రప్రదేశ్ ను అందించే లక్ష్యంతో పనిచేస్తున్న సియం చంద్రబాబు నాయుడు విశాఖపట్నానికి గూగుల్ తెచ్చారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు మంగళవారం కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా సెంటర్ విశాఖకు రావడం అంటే మామూలు విషయం కాదని, దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ పెట్టుబడిని సాధించిన ఘనత ముఖ్యమంత్రి సొంతం అని కొనియాడారు.ఏపీలోని తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపనతో నేటి నుండి విశాఖ రూపురేఖలు మారిపోనున్నాయని, విశాఖ అంటే కేవలం పోర్ట్ సిటీ మాత్రమే కాదు, ఇకపై అది గ్లోబల్ ఖిడేటా సిటీఖి గా కీర్తి గడిస్తుందని తెలిపారు.అదానీ కనెక్స్, ఎయిర్ టెల్ నెక్స్ ట్రా భాగస్వామ్యంతో గూగుల్ ఏర్పాటు చేస్తున్న ఈ మెగా ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలవడమే కాక, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే ఏమిటో గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్ నిరూపించి, ఇన్వెస్టర్లకు నమ్మకం కలిగించడంలో విజయం సాధించేలా చేసిందని హర్షం వ్యక్తం చేశారు.గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా 1 గిగా వాట్ సామర్థ్యాన్ని అందుకోవడం ఏపీ సాధించిన ఘనత అని, 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏపీ ఆర్థిక వ్యవస్థ జెట్ స్పీడ్‌తో దూసుకుపోవడం ఖాయం అని ఆశాభావం వ్యక్తం చేశారు.2047 నాటికి వికసిత్ భారత్ సాధించడంలో ఏపీ కీలకం కాబోతోందని, గూగుల్ డేటా సెంటర్ విశాఖను టెక్నాలజీకి చిరునామాగా మారుస్తుందని సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు మరియు రాష్ట్ర కార్యదర్శి యం.సుబ్బయ్య, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, కాపునాడు నాయకుడు తొగురు హరి తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



శ్రీకాళహస్తి ఏప్రిల్ 28 ప్రభాతవార్త

ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయము శ్రీకాళహస్తిలో వేసవి శిక్షణ తరగతులు గ్రంథాలయ అధికారి ఏ. హరికృష్ణ ఆధ్వర్యంలో సరస్వతి దేవి పూజ నిర్వహించి ప్రారంభించారు. ఎంతో ఉత్సాహంగా విద్యార్థిని విద్యార్థులు హాజరు అయినారు. గ్రంథాలయ అధికారి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వేసవి శిక్షణా కార్యక్రమాని కి హాజరై వివిధ పుస్తకాలు చదువుకొని విజ్ఞానవంతులు కావాలని సూచించారు.ఈకార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు షణ్ముగం , గుడ్ హ్యాండ్ రైటింగ్ బోధకులు మహావీర్ , వేదిక్ మేథ్స్ బోధకులు మంజునాథ్ పేపర్ క్రాఫ్ట్ రేవతి పాల్గొని తరగతులను నిర్వహించారు.ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లితండ్రులు,పాఠకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులో బస్సు ప్రయాణం సురక్షితం

శ్రీకాళహస్తి ఏప్రిల్ 28 ప్రభాతవార్త

ఏపీఎస్ఆర్టీసీ శ్రీకాళహస్తి డిపో వారు ప్రయాణం సురక్షితం సుఖవంతం అనే నానుడి స్పష్టీకరిస్తూ ప్రయాణికుల సౌకర్యాల పైన దృష్టి సారించి ప్రయాణికులకు తగు సౌకర్యాలు కల్పించుచున్నారు .ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం మరియు దివ్యాంగ పథకం అమలులోకి తీసుకొని రావడంతో ఏపీఎస్ఆర్టీసీ వారి పైన ఇంకనూ ఎక్కువ బాధ్యత పెరిగినది తదనుగుణంగా ఏపీఎస్ఆర్టీసీ సిబ్బంది బస్సులు ఎటువంటి ఫెయిల్యూర్స్ లేకుండా బస్సులు నడుపుతూ ప్రజల మన్ననలు చురుగొను చున్నారు. బస్ స్టేషన్ ప్రాంగణంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువ అయినందున ప్రయాణికులకు తగు మౌలిక వసతులు సమకూర్చుటలో కూడా ముందంజలో ఉన్నారు మన శ్రీకాళహస్తి బస్ స్టేషన్ నందు ప్రయాణికులు ఇబ్బంది పడకుండా తమ తమ ప్రదేశములకు వెళ్లడానికి ప్రతి ప్లాట్ఫామ్ నందు బస్సులు తిరుగు సమయముల పట్టికలు పెట్టడం జరిగినదని డిపో మేనేజర్ తెలిపారు. మరుగుదొడ్లు సుచిగా ఉంచుచున్నాము. ప్రయాణికులు కూర్చోవడానికి అనువైన కుర్చీలు వేసి ఉన్నాము .మరియు ప్రతి ప్లాట్ ఫామ్ లో ఉన్న ఫ్యాన్స్ పనిచేయు విధముగా అమర్చడమైనది. పరిసరముల పరిశుభ్రత కొరకు ప్రతి ప్లాట్ ఫారం నందు తడి చెత్త, పొడి చెత్త వేయుటకు చెత్త కుండీలు పెట్టడం జరిగిందన్నారు. బస్ స్టేషన్ ప్రాంగణంలో చెత్తను అప్పటికప్పుడు తీయిస్తూ ,మోపింగ్ చేయించుచున్నాము. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవాలయం వారు కూడా భక్తులు ఇబ్బంది పడకుండా దేవాలయం నుండి బస్ స్టేషన్ కు బస్ స్టేషన్ నుండి దేవాలయమునకు 8 పర్యాయములు ఉచితముగా బస్సు ను నడుపుతున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఈరోజు డిపో గ్యారేజీ సిబ్బంది గ్యారేజీ నందు అంబలి పంపిణీ చేయడం జరిగినది. అలాగే బస్స్టేషన్ నందు అసోసియేషన్ వారు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు.

## విలేఖరిని హత్య చేయడం అమానుష చర్య.....

రేణిగుంట ఏప్రిల్ 28 ప్రభాతవార్త



వి.కోట మండలం ఓ దినపత్రిక విలేఖరి జగన్మోహన్ రెడ్డిని హత్య చేయడం అమానుష చర్యగా రేణిగుంట విలేకరులు ముక్తకంఠంతో ఖండించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహం నుండి అర్బన్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి అర్బన్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం ప్రత్యేక చట్టాలను తెచ్చి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి అంకిమణి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముని రామయ్య, రేణిగుంట జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి భాగ్యరాజు, రేణిగుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మురళి రాయల్, జర్నలిస్టులు, సిపిఎం ఏర్పేడు రేణిగుంట మండలాల కార్యదర్శి హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### -ఇంచార్జి కమిషనర్ శారదా దేవి

తిరుపతి,ఏప్రిల్ 28ప్రభాతవార్త:

నగరంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఇన్‌చార్జి కమిషనర్ శారదా దేవి అధికారులకు సూచించారు. ప్రజా పిర్యాదుల పరిష్కారం వేదికలో వచ్చిన పిర్యాదుల మేరకు మంగళవారం ఎల్ఐసి రోడ్డు, ఆఫీసర్స్ క్లబ్ , బాలాజీ కాలనీ, పోలీస్ క్వార్టర్స్, హమీద్ నగర్ తదితర ప్రాంతాలను అధికారులతో కలసి ఇంచార్జి కమిషనర్ పరిశీలించి, అనంతరం అధికారులతో సమావేశమై సమీక్షి ంచారు. ఈ ఎస్ ఐ హాస్పిటల్ సమీపంలోని అన్న కాంటీన్లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్బంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారం వేదిక, వార్డుల్లో పర్యటించిన సమయంలో వచ్చే వినతులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఆయా విభాగాల అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని తెలిపారు. ముఖ్యంగా త్రాగునీటి సరఫరా, పారిశుద్ధం, కాలువలు శుభ్రం చేయడం, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి ఎక్కువ సమస్య లు వస్తున్నాయని వాటిని పరిష్కరించాలని తెలిపారు. జనన గణన, స్వీయ గణన ను వేగవంతం చేయాలని ఆన్లైన్ ద్వారా స్వర్ణ వార్డు కార్యదర్సులను ఆదేశించారు. వార్డు పర్యటన, సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, ఏసిపి పార్వతి ప్రియ, డి.ఈ మధు ,శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, సుమతి, తదితరులు ఉన్నారు.